

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

08.11.2026
ఆదివారం |రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 129
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.



పాఠకులకు, ప్రకటనకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు.

సెలవు

దీపావళి సందర్భంగా ఆదివారం అనంత జనశక్తి ఆఫీసులకు సెలవు. సోమవారం సంచిక వెలువడదు. మంగళవారం మళ్లీ కలుద్దాం.

పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి

- ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులే
- సొంత కంపెనీ టెండర్లలో పాల్గొని..



హైదరాబాద్, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్
కోడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ మంత్రి పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా వేదిక ద్వారా ఆరోపించారు. మంత్రి పొంగులేటి సొంత కంపెనీ టెండర్లలో పాల్గొని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని విమర్శించారు. రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న రైతాంగానికి చుక్క నీరు అందకముందే అంచనా వ్యయాన్ని ఐదు రెట్లకు పెంచారని వెల్లడించారు. ట్యాంకర్ల కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే ప్రాజెక్టుల పేరుతో తెలంగాణ సంపదను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

5లో..

నీటి లభ్యతను బట్టే పంటలు వేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- ఎల్‌నినోతో వర్షా లు తగ్గే అవకాశం
- ఎండలు పెరిగే ప్రమాదం
- వచ్చే 8 నెలలు గడ్డు పరిస్థితులు
- ఆరుతడి పంటలకే ప్రాధాన్యం
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- కష్టకాలంలో అండగా ఉంటాం
- ప్రాజెక్టుల్లో తగ్గిన నీటి నిల్వలు
- డిసెంబర్‌లో అసెంబ్లీ ప్రత్యేక భేటీ



హైదరాబాద్, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్
'ఎల్‌నినో ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేశారు. ఈ దెబ్బతో రాష్ట్రంలో వర్షా లు తగ్గడమే కాకుండా.. ఎండలు కూడా పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు అలర్ట్‌గా ఉండాలని పేర్కొన్నారు. వచ్చే 8 నెలలు గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. పంటలు సాగు చేసే ముందు రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. నీరు తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ సీజన్‌లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవచ్చని పేర్కొన్నారు. మరోవైపు ఎండలు తీవ్రంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను వివరిస్తూ వచ్చే జూలై వరకు వర్షాలు లేకపోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పంటలు వేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటల సాగుతో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని.. అందువల్ల ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మవద్దని అన్నారు.
'మీకన్నా నాకు ఆత్మబంధువులు ఎవరూ లేరు. కష్టకాలంలో ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మనమంతా ఏకమై ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం' అని రేవంత్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమం చేపట్టి రాష్ట్రంలోని అన్నిప్రాంతాల్లో పర్యటిస్తానని.. రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకుంటానని తెలిపారు. రా

5లో..

ఉద్యోగులకు దీపావళి బొనాంజా

- డీఏను 63 శాతానికి పెంచుతున్నం
- సీఎం యోగీ ఆదిత్యనాథ్ ప్రకటన
- కరువు భత్యం పెంపు ప్రాధాన్యత



లక్నో, నవంబర్ 07, అనంతజనశక్తి న్యూస్
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే కరువు భత్యాన్ని 53 శాతానికి పెంచుతూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సవరించిన రేటు 2026జులై 1 నుంచి అమల్లోకి వస్తుంది. పెంచిన ఈ డీఏను నవంబర్ నెల వేతనంతో పాటు చెల్లిస్తారు. దీంతో దీపావళికి ముందు లక్షలాది మంది ఉద్యోగులకు ఆర్థిక ఉపశమనం కలుగుతుంది. సవరించిన డీఏ వల్ల ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సహాయం పొందుతున్న విద్యాసంస్థలు, సాంకేతిక విద్యాసంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఉద్యోగులు లబ్ధి పొందుతారు. ప్రస్తుతం 60 శాతం ఉండగా.. అదనంగా మరో 3 శాతం పెంచారు.

2లో..

కౌంటింగ్‌కు ముందు రోజే గుండెపోటు

- చనిపోయాక ఎంపీటీసీగా గెలిచిన జనసేన అభ్యర్థి
- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం
- ధుమంతునిగూడెంలో ఎంపీటీసీ అభ్యర్థి విజయం

2లో..



అమరావతి, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్
ఏపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ సాగుతుంది. ఇందులో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటున్నారు. ఓటమిపాలైన వాళ్లు కారణాలు విశ్లేషించుకుంటున్నారు. కానీ తూర్పుగోదావరి జిల్లాలోని ఓ గ్రామంలో మాత్రం ఓ అభ్యర్థి గెలుపు తీవ్రమైన విషాదాన్ని, కన్నీటిని మిగిల్చింది. తమకు మంచి చేస్తుందనుకున్న నాయకురాలు విజయం సాధించినా.. దానిని ఆస్వాదించడానికి ఆమె ప్రాణాలతో లేకపోవడం ఆ గ్రామస్థుల గుండెలను మెలిపెడుతుంది.



2లో..

ఒక్క ఓటుతో తలరాత మారింది

ఏపీ పరిషత్ ఎన్నికల ఫలితాల వేళ.. ఆసక్తికర ఘటనలు

నెల్లూరులో తీరని విషాదం

- గుండెపోటుకు బలైన డాక్టర్ లావణ్య
- వైద్యం అందేలోగా మరణం



2లో..

రాజకీయ భీష్ముడికి శత వసంతాలు!

- నవంబర్ 8న 100వ ఏట అడుగుపెడుతున్న భారతరత్న ఎల్ కే. అడ్వాణీ
- జనసంఘ్ నుంచి బీజేపీ ఎదుగుదల వరకు కీలక ప్రస్థానం.. భారత రాజకీయాల్లో చెరగని ముద్ర

2లో..



న్యూఢిల్లీ నవంబర్ 07
అనంత జనశక్తి న్యూస్
భారత రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసిన రాజకీయ దిగ్గజం, భారతరత్న లాల్‌కృష్ణ అడ్వాణీ నవంబర్ 8న వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లు, చారిత్రక పరిణామాలను ఎదుర్కొన్న ఆయన జీవితం భారత రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. జనసంఘ్ నిర్మాణం నుంచి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విస్తరణ వరకు ఆయన పోషించిన పాత్ర రాజకీయ వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది.

కన్నీరు పెట్టుకున్న మాజీ మంత్రి రోజా

- ఫలితం మార్చారంటూ ఆరోపణలు

2లో..

- కౌంటింగ్ కేంద్రం వద్ద ధర్నా
- నగరి కౌంటింగ్ సెంటర్ దగ్గర కొంతసేపు ఉద్రిక్తత



6 నెలల్లో 7 సార్లు నాపై హత్యాయత్నం

- బీజేపీ శ్రేణులపై అభిషేక్ బెనర్జీ ఆరోపణలు
- కోల్‌కతాలోని కాళీఘాట్ నివాసంపై..
- అర్ధరాత్రి దాడి అని ఆరోపణ



5లో..

రాజకీయాల్లోకి మరో కొత్త పార్టీ

- 1న పేరును ప్రకటించనున్న విజయసాయిరెడ్డి
- దేశభక్తి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ హక్కుల పరిరక్షణే
- ఆ 2 పార్టీలు విఫలం - విజయసాయిరెడ్డి

అమరావతి, నవంబర్ 07,
అనంత జనశక్తి న్యూస్
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏపీ రాజకీయాల్లో ప్రస్తుతం స్పష్టమైన శూన్యత కనిపిస్తోందని, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా నవంబర్ 11న ఒక కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

2లో..





పాక్ సందర్శనకు పంజాబ్
సీఎం భగవంత్ మాన్ ఆసక్తి

- వీసా జారీపై ఇస్లామాబాద్ కీలక వ్యాఖ్యలు

5లో..

బ్యాలెట్ బాక్సులు నడిరోడ్డుపై
ఎందుకు దింపారు?

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటే లాఠీఛార్జ్ చేస్తారా?
- అప్పిరెడ్డి అరెస్టు, నిర్బంధాన్ని ఖండన
- ఎమర్జెన్సీని తలపించే ఈ పాలన హేయం

అమరావతి, నవంబర్ 07, అనంతజనశక్తి న్యూస్
వైయస్సార్‌సీపీ శాసనమండలి సభ్యుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అక్రమ అరెస్టు, నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ సీఎం వైయస్ జగన్ పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ పార్టీ అభ్యర్థులతో, ప్రజలతో కలిసి శాంతియుతంగా ఆందోళన చేస్తే, దానిపై తప్పుడు కేసులు పెట్టి, అడ్డగోలుగా అరెస్టు చేసి, నిర్బంధానికి గురిచేయడం దుర్మార్గమన్నారు.

2లో..





ఉద్యోగులకు దీపావళి బొనాంజా

(మొదటి పేజీ తరువాయి)

దీంతో మొత్తం 63 శాతానికి చేరుకుంది.
జూలై నుంచి అక్టోబర్ 2026 వరకు ఉన్న కాలానికి సంబంధించిన బకాయిలను ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలలో జమ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సవరణతో, అర్హులైన ఉద్యోగులకు డీఏ రేటు 63 శాతానికి పెరుగుతుంది. సవరించిన ఈ భత్యం నవంబర్ జీతంతో కలిపి చెల్లిస్తారు. అంతకుముందు నాలుగు నెలల బకాయిలను వారి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలలో విడిగా జమ చేస్తారు. దీపావళికి ముందు వెలువడిన ఈ ప్రకటన రాష్ట్రంలోని అధికశాతం ఉద్యోగ వర్గానికి ప్రయోజనం చేకూర్చనుంది.
అంతకుముందు, లక్నోలో కొత్తగా నియమితులైన 4,543 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ప్లాటూన్ కమాండర్లకు సీఎం యోగి నియామక పత్రాలను అందజేశారు. ''మిషన్ రోజ్‌గార్' కింద నిష్పక్షపాత, పారదర్శకమైన నియామక ప్రక్రియ ద్వారా ఉత్తరప్రదేశ్ పోలీసులో కొత్తగా నియమితులైన 4,543 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ప్లాటూన్ కమాండర్లకు ఈరోజు లక్నోలో నియామక పత్రాలు అందజేశాం... డబుల్ ఇంజిన్ సర్కారు యూపీ యువతకు నియామక పత్రాలు అందించే ఈ పరంపర ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగుతుందని నేను మీకు హామీ ఇస్తున్నాను'' అని ఎక్స్ (ట్విట్టర్)లో యోగి ఆదిత్యనాథ్ పోస్ట్ పెట్టారు.
మరికొద్ది నెలల్లో ఉత్తరప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉద్యోగులను ప్రసన్నం చేసుకోడానికి ప్రభుత్వంతో పాటు ప్రతిపక్షాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉద్యోగులకు కరువు భత్యం పెంపుపై సీఎం యోగి నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ మధ్య హోరాహోరీ పోరు సాగింది. మొత్తం 12 స్థానాలకు బీజేపీ ఆరు, ఎస్పీ ఐదు చోట్ల గెలిచాయి. ముఖ్యంగా అయోధ్య పరిధిలోని రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో బీజేపీ ఓడిపోవడం గమనార్హం.

బ్యాలెట్ బాక్సులు నడిరోడ్డుపై

ఎందుకు దింపారు?



(మొదటి పేజీ తరువాయి)

ఎమర్జెన్సీని తలపించే ఈ పాలన అత్యంత హేయమంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత, నేరుగా నాగార్జున వర్శిటీకి చేరాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దింపారు? అని జగన్ ప్రశ్నించారు. ఎవరి ఆదేశాలమేరకు ఆ బ్యాలెట్ బాక్సులను దింపారు? అసలు బ్యాలెట్ బాక్సులకు ఉండాల్సిన భద్రత ఏమైంది? అని నిలదీశారు. స్ట్రాంగ్ రూంకు చేరాల్సిన బ్యాలెట్ బాక్సులు నడిరోడ్డుమీద కనిపిస్తే, కళ్లెదుటే వాటిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలమీద లాఠీఛార్జి చేస్తారా? తప్పులు మీరుచేసి, ఏకంగా బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నంచేసి, మళ్లీ మావాళ్లపై అక్రమకేసులా? చివరకు ఒక ఎమ్మెల్సీమీద డెకాయిటీ, దొంగతనం కేసులుకూడా పెడతారా? ఇంతకంటే దుర్మార్గం ఏముంటుంది? అని జగన్ మండిపడ్డారు.
"ఈ స్థానిక ఎన్నికల్లో.. నామినేషన్ల రిగ్గింగ్, నామినేషన్ల స్క్రూట్నీ రిగ్గింగ్, పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్, పోలింగ్ సైక్లింగ్, పోలింగ్ పర్సంటేజీల రిగ్గింగ్, చివరకు పోలింగ్ ముగిశాక ఇలా బ్యాలెట్ బాక్సులు కూడా రిగ్గింగ్? చంద్రబాబుగారూ ఈ స్థానిక ఎన్నికల్లో మీరు ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తుంటే, ఈ తప్పుల్ని ఎవరైనా ప్రశ్నిస్తే, వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? @ncbn గారూ మీ అధికార, పోలీసు బలాన్ని ప్రయోగించి కట్టడిచేయాలని అనుకున్నంత మాత్రాన, మీరు చేసిన ఎన్నికల అక్రమాలు దాచిపెట్టలేరు. మీ అప్రజాస్వామిక పద్ధతులను దేశమంతా చూస్తూనే ఉంది. ప్రజలు చూస్తూ ఊరుకోరు, ఇలాంటి దుర్మార్గాలను సహించరు, మీకు తగిన బుద్ధిచెప్తారు." అని ట్వీట్‌లో మాజీ సీఎం జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు ముందు రోజే గుండెపోటు

(మొదటి పేజీ తరువాయి)

ఓ మహిళా ఎంపీటీసీ అభ్యర్థి ఓట్ల లెక్కింపునకు సరిగ్గా ఒక్కరోజు ముందు గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె ఘన విజయం సాధించారు.
తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం ఎంపీటీసీగా జనసేన పార్టీ అభ్యర్థిగా గారపాటి దివ్య (28) పోటీ చేశారు. జోరుగా ప్రచారం చేశారు. తనకు ఓట్లు వేయమని ప్రజలను కోరారు. సేవ చేసేందుకు అవకాశం ఇవ్వాలని అందరినీ కోరారు. అయితే ఎన్నికల పోలింగ్ ముగిసి కౌంటింగ్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో ఓట్ల లెక్కింపునకు కేవలం ఒక్కరోజు ముందు దివ్య గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. అయితే శుక్రవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో దివ్య తన సమీప వైసీపీ అభ్యర్థిపై ఏకంగా 352 ఓట్ల భారీ మెజారిటీతో తిరుగులేని విజయాన్ని అందుకున్నారు.



ఓ వైపు ఆమె గెలుపు వార్త... మరోవైపు ఆమె శాశ్వతంగా దూరమైందన్న చేదు నిజం.. ధుమంతునిగూడెం ప్రజలను కన్నీరుమున్నీరు పెట్టిస్తున్నాయి. కాగా ప్రేమ వివాహం చేసుకున్న దివ్యకు ఇద్దరు పసిపిల్లలు ఉన్నారు. పెద్దకుమారుడికి ఐదేళ్లు కాగా, రెండో బాబు కేవలం మూడు నెలల పసికందు. తల్లి మరణంతో ఆ చిన్నారులు రోదిస్తున్నారు. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుని ముందుకు అడుగులు వేసిన దివ్య ఆ గెలుపు క్షణాలను ఆస్వాదించక ముందే అనంత లోకాలకు వెళ్లిపోవడం అందరిని కలవర పెడుతుంది.
కాగా మొత్తం 582 జడ్పీటీసీ, 7 వేల 767 ఎంపీటీసీ స్థానాలకు శనివారం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 582 జడ్పీటీసీ స్థానాలకు 2 వేల 169 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. అదేవిధంగా 7 వేల 7 వందల 67 ఎంపీటీసీ స్థానాలకు 18 వేల 843 మంది బరిలో దూకారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఈసారి 70.72 శాతం పోలింగ్ నమోదైంది.

కన్నీరు పెట్టుకున్న మాజీ మంత్రి రోజా

చిత్తూరు, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్

చిత్తూరు జిల్లా నగరి కౌంటింగ్ సెంటర్ దగ్గర ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. విజయపురం మండలం ఇల్లత్తూరు ఎంపీటీసీ అభ్యర్థి గెలుపు విషయంలో రగడ జరిగింది. ఈ విషయంలో సినీ నటి, మాజీ మంత్రి రోజా కన్నీరు కూడా పెట్టుకున్నారు. అనంతరం అక్కడే ఆందోళన చేపట్టారు. విజయపురం మండలం ఇల్లత్తూరు ఎంపీటీసీ స్థానంలో వైసీపీ అభ్యర్థి విజయం సాధించారని, కానీ అధికారులు మాత్రం ఉద్దేశపూర్వకంగా టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు తప్పుగా ప్రకటించారని రోజా తీవ్ర స్థాయిలో ఆరోపించారు. తాము గెలిచినా డిక్లరేషన్ ఫామ్ ఇవ్వడం లేదని ఆమె అన్నారు. ఈ మేరకు అధికారులను కూడా ఆమె నిలదీశారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వెంటనే పోలీసులు వైసీపీ అభ్యర్థిని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించేశారు. దాంతో పోలీసులు, అధికారుల తీరుపై నిరసనగా.. కౌంటింగ్ కేంద్రం ముందు రోజా బైఠాయించి ధర్నా చేశారు. నిరసనకు దిగిన రోజాను పోలీసులు బలవంతంగా అక్కడ నుంచి తరలించే ప్రయత్నం చేశారు.



పార్టీ అండతోనే అధికారులు ఇలా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రోజా మండిపడ్డారు. ప్రజలు మాకే ఓట్లు వేశారని, కానీ ఆ గెలుపును కూడా లాక్కోవాలని చూస్తున్నారని రోజు విమర్శించారు. గెలిచే సత్తా లేనప్పుడు అసలు ఈ ఎన్నికలు పెట్టారని ప్రశ్నించారు. గెలిచిన అభ్యర్థికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం సాగుతుందని రోజా స్పష్టం చేశారు.
నామినేషన్ ప్రక్రియలో అలా...
చిత్తూరు జిల్లా నగరి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో కూడా ఇలాంటి రగడే చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్ స్థానానికి జరిగిన నామినేషన్ ప్రక్రియలో కూడా రచ్చ జరిగింది. అక్కడ నామినేషన్ల పరిశీలన సమయంలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి బాలకృష్ణన్ దాఖలు చేసిన డాక్యుమెంట్లలో లోపాలు ఉన్నాయంటూ ఎన్నికల అధికారులు ఆయన నామినేషన్‌ని తిరస్కరించారు. ఆ వెంటనే బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు. దీంతో మాజీ మంత్రి రోజా రంగంలోకి దిగి.. తమ అభ్యర్థి నామినేషన్ పత్రాలను కావాలనే చించివేశారని ఆరోపణలు చేశారు. అక్కడితో ఆగకుండా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిని కలసి ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ భీష్ముడికి శత వసంతాలు!

(మొదటి పేజీ తరువాయి)

1927 నవంబర్ 8న కరాచీలో జన్మించిన అద్వాణీ చిన్నతనంలోనే దేశ విభజన పరిణామాలను ఎదుర్కొన్నారు. 1947లో స్వస్థలాన్ని విడిచి భారత్‌కు రావాల్సి వచ్చింది. అయినప్పటికీ వెనుకడుగు వేయకుండా ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. రాజస్థాన్‌లో పనిచేసిన అనంతరం ఢిల్లీకి చేరుకుని జనసంఘ్ బలోపేతానికి కృషి చేశారు.
అటల్–అద్వాణీ ద్వయం.. రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయం!
అటల్ బిహారీ వాజ్‌పేయితో కలిసి దశాబ్దాలపాటు పనిచేసిన అద్వాణీ పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ఇద్దరి మధ్య ఉన్న పరస్పర సహకారం, సమన్వయం బీజేపీ ఎదుగుదలకు దోహదపడింది. 1980లో బీజేపీ ఆవిర్భావం తర్వాత పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించడంలో అద్వాణీ కీలకంగా వ్యవహరించారు. 1989లో పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కృషి చేశారు.
ఎమర్జెన్సీ పోరాటం నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు!
1975లో దేశంలో విధించిన ఎమర్జెన్సీ అద్వాణీ రాజకీయ జీవితంలో కీలక మలుపుగా నిలిచింది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరిగిన పోరాటంలో ఆయన పాల్గొన్నారు. 1977లో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాచార, ప్రసార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం కేంద్ర హోంమంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా పనిచేసి జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు.
సోమనాథ్ నుంచి అయోధ్యకు.. చరిత్రలో నిలిచిన రథయాత్ర!
1990లో సోమనాథ్ నుంచి అయోధ్య వరకు అద్వాణీ చేపట్టిన రథయాత్ర దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా నిలిచింది. రామమందిర ఉద్యమానికి జాతీయస్థాయిలో రాజకీయ ప్రాధాన్యత పెరగడంలో ఈ యాత్ర కీలక పాత్ర పోషించింది. యాత్ర సందర్భంగా బీహార్‌లో ఆయన అరెస్టు కావడం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.
పార్టీ నిర్మాణంలో ప్రత్యేక ముద్ర.. పార్లమెంటరీ ప్రస్థానంలో గుర్తింపు!
1970లో పార్లమెంటరీ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన అద్వాణీ రాజ్యసభ, లోక్‌సభల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. 1996లో బీజేపీ లోక్‌సభలో అతిపెద్ద పార్టీగా అవతరించిన సమయంలో ఆయన పార్టీ నాయకత్వంలో కీలకంగా ఉన్నారు. పార్టీకి బలమైన సంస్థాగత పునాది వేయడంతో పాటు కొత్త తరాల నాయకులు, కార్యకర్తలను తీర్చిదిద్దడంలోనూ పాత్ర పోషించారు.
పుస్తక పఠనం.. నిరాడంబరత ఆయన ప్రత్యేకత!
రాజకీయ జీవితంతో పాటు పుస్తక పఠనం, వార్తాపత్రికల అధ్యయనం, సినిమాలు, నాటకాలపై అద్వాణీకి ప్రత్యేక ఆసక్తి ఉంది. 'మై కంట్రీమై లైఫ్', 'ఎ ప్రిజనర్స్ స్క్రాప్‌బుక్' వంటి పుస్తకాల ద్వారా తన అనుభవాలను, రాజకీయ పరిణామాలను అక్షరబద్ధం చేశారు. ఆయన సతీమణి కమలా అద్వాణీ ప్రజా జీవితంలో అందించిన సహకారం కూడా ప్రత్యేకంగా ప్రస్తావించదగినది.
భారతరత్నతో దేశ అత్యున్నత గౌరవం!
సుదీర్ఘ ప్రజా, రాజకీయ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2024లో అద్వాణీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. జనసంఘ్ కాలం నుంచి బీజేపీ ఎదుగుదల వరకు సాగిన ఆయన ప్రయాణం అనేక చారిత్రక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచింది. వందో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న అద్వాణీ రాజకీయ ప్రస్థానం, నాయకత్వ అనుభవాలు, పార్టీ నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.



రాజకీయాల్లోకి మరో కొత్త పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

దేశభక్తి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ హక్కుల పరిరక్షణే ముఖ్యాంశాలుగా తమ నూతన పార్టీ నడుస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. నవంబర్ 11న పార్టీ ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేయడం వెనుక ఎలాంటి ఇతర వ్యూహాలు లేవని, పురోహితులు నిర్ణయించిన శుభ ముహూర్తం ప్రకారమే ఆ తేదీని ఎంచుకున్నామని ఆయన వెల్లడించారు.
"ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ (టీడీపీ), ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ రెండింటి తీరు పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ రెండు పార్టీలతో విసిగిపోయిన ప్రజలు ఒక బలమైన ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన ఈ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికే మేము నవంబర్ 11న కొత్త పార్టీని స్థాపించాలని నిర్ణయించాం," అని శుక్రవారం పీటీఐ కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో విజయసాయిరెడ్డి తెలిపారు.
ఆ 2 పార్టీలు విఫలం విజయసాయిరెడ్డి
రాష్ట్రంలో వరుసగా పరిపాలించిన ప్రభుత్వాల తీరుపై విజయసాయిరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శాంతిభద్రతల నిర్వహణతో పాటు కీలక రంగాల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ పలు గణాంకాలను బయటపెట్టారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్రానికి రూ. 1 లక్ష కోట్లుగా ఉన్న బహిరంగ అప్పులు.... ఇప్పుడు ఏకంగా రూ. 10 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆరోపించారు. ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతి ఒక్క పౌరుడిపై సగటున రూ. 5.5 లక్షల అప్పు భారం పడిందని ఆయన పేర్కొన్నారు.
కేంద్రంతో సమన్వయం.. ఏపీ ప్రయోజనాలే లక్ష్యం!
తమ కొత్త పార్టీ ప్రధాన ఉద్దేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ఇక్కడి ప్రజల ప్రయోజనాలను కాపాడటమేనని విజయసాయిరెడ్డి చెప్పారు. ఢిల్లీలో కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వంతో సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటూ ఏపీ ప్రజలకు దక్కాల్సిన న్యాయాన్ని, నిధులను రాబట్టడానికి తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. ఒకప్పుడు వైఎస్సార్‌సీపీలో అత్యంత కీలక నాయకుడిగా వెలుగొందిన విజయసాయిరెడ్డి.... మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించేవారు. అయితే ఆ పార్టీతో విభేదించి బయటకు వచ్చిన ఆయన.... ఇప్పుడు సొంతంగా రాజకీయ పార్టీని ప్రకటిస్తుండటం తెలుగు రాష్ట్రాల రాజకీయంలో చర్చనీయాంశంగా మారింది.



నెల్లూరులో తీరని విషాదం

నెల్లూరు, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్

వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా ఒక సేవా మార్గంగా ఎంచుకున్న ఓ యువ వైద్యురాలు కుంకాల డాక్టర్ లావణ్య .. తనపై దాడి చేసిన ఓ అరుదైన ప్రాణాంతక వ్యాధిని సైతం ఆత్మస్థైర్యంతో ఓడించారు. మృత్యువు అంచు నుంచి ఆరోగ్యంగా వెనక్కొచ్చి ఎంతోమంది రోగులకు సేవలందించారు. కానీ ఆ సేవామూర్తిని ఆకస్మికంగా గుండెపోటు బలి తీసుకుంది. వైద్యం అందేలోపే ఆమె ప్రాణాలు విడిచింది. ఆమె మరణం నెల్లూరు వైద్య వర్గాలను, ప్రజలను తీవ్రంగా కలచివేస్తోంది.
అతి చిన్న వయస్సులోనే డాక్టర్ మరణం...
డాక్టర్ లావణ్య (32) శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం చెముడుగుంటకు చెందిన ఎనెల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ కుంకాల దశరథ నాగేంద్ర ప్రసాద్, లక్ష్మి దంపతుల కుమార్తె. ఈమె 2016లో నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఆ తర్వాత బెంగళూరులోని సెయింట్ మార్తాస్ ఆస్పత్రిలో డీఎన్‌బీ (జనరల్ మెడిసిన్), చెన్నైలో డీఎం (న్యూరాలజీ) అభ్యసించి గోల్డ్ మెడల్ సాధించారు. ఆ తర్వాత నెల్లూరు ప్రభుత్వ వైద్య కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్డియాలజిస్ట్ అయిన డాక్టర్ నాగేంద్ర ప్రసాద్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.
అరుదైన నరాల వ్యాధిని జయించి...
కుంకాల డాక్టర్ లావణ్య చదువు, వృత్తి, వ్యక్తిగతం జీవితం సాఫీగా సాగుతున్న తరుణంలో ఊహించని కుదుపు ఎదురైంది. ఎంతో ఆరోగ్యంగా ఉన్న లావణ్యం 2025లో సడన్‌గా మాట్లాడే శక్తిని కోల్పోయారు. కనీసం నిలబడలేని స్థితికి చేరుకున్నారు. మెడికల్ టెస్ట్‌ల్లో ఆమెకు మయాస్తినియా గ్రావిస్ అనే అత్యంత అరుదైన ఆటో ఇమ్యూన్ నరాల వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ వ్యాధి గురించి తెలిసినా లావణ్య ఏ మాత్రం కుంగిపోలేదు. ఎంతో ధైర్యంతో ఆ వ్యాధిని జయించారు. కీలకమైన సర్జరీ చేయించుకున్నారు. అనంతరం రెస్ట్ తీసుకోవాలని డాక్టర్లు చెప్పినా కేవలం నాలుగు నెలల్లోనే విధుల్లో చేరారు. ఆ తర్వాత గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉచితంగా న్యూరాలజీ పరీక్షలు, వైద్య సేవలు అందించడం మొదలుపెట్టారు.
కానీ అలాంటి యువ డాక్టర్ లావణ్యని ఇప్పుడు 'గుండెపోటు' కాటేసింది. భర్త కార్డియాలజిస్ట్, తండ్రి ఆస్పత్రి చైర్మన్ అయినా ప్రయోజనం లేకుండా పోయింది. కనీసం చికిత్స చేసుకునే సమయం కూడా ఇవ్వకుండా లావణ్యను బలితీసుకుంది. ఇలాంటి యువ డాక్టర్ అకస్మాత్తుగా చనిపోవడం నెల్లూరు వైద్యులను, బంధుమిత్రులను కన్నీటి శోకంలో ముంచింది.



ఒక్క ఓటుతో తలరాత మారింది

నెల్లూరు, నవంబర్ 07, అనంతజనశక్తి న్యూస్

ఆంధ్రప్రదేశ్ పరిషత్ ఎన్నికల ఫలితాల వేళ ఆసక్తికరమైన ఘటనలు కొన్ని జరిగాయి. వీటిపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. నెల్లూరు జిల్లా చిల్లకూరులోని తమ్మనపట్నంలో ఒక ఓటు ఫలితాలను నిర్ణయించింది. అక్కడ టీడీపీ అభ్యర్థి అరుణ ఒక ఓటు తేడాతో వైసీపీ అభ్యర్థిపై విజయం సాధించారు. దీంతో సదరు వైసీపీ అభ్యర్థి న్యాయం చేయండంటూ కౌంటింగ్ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. మరోవైపు పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలంలోని టీడీపీ అభ్యర్థి కొల్లి అరుణ కుమారి కూడా ఒక ఓటు తేడాతోనే గెలిచారు. ఈ ఇద్దరూ పేర్లు అరుణ కావటం ఆసక్తి రేపింది.
తండ్రి వైసీపీ.. కూతురు టీడీపీ.. గెలుపు ఇద్దరిదీ
కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో వైసీపీ అభ్యర్థి పొనుగుపాటి సత్యనారాయణ పలివెల 2 ఎంపీటీసీ స్థానం కోసం బరిలో నిలబడ్డారు. ఆయన కుమార్తె టీడీపీ నుంచి కొత్తపేట 2 ఎంపీటీసీ స్థానం కోసం పోటీపడ్డారు. అయితే ఎన్నికల్లో తండ్రీకూతుళ్లు విజయం సాధించారు.
జగన్ మేనత్త గ్రామంలో టీడీపీ జెండా
ఎన్టీఆర్ జిల్లా గణపవరంలో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి గెలుపొందారు. జగన్ మేనత్త, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలమ్మ స్వగ్రామం ఇది. ఇక్కడ టీడీపీ 20 ఏళ్ల తరువాత గెలిచింది.
తోడికోడళ్ల సమరం.. జనసేనకు విజయం
పశ్చిమ గోదావరి ఆచంట మండలం పెదమల్లంలో తోడికోడళ్ల మధ్య ఎంపీటీసీ స్థానం కోసం పోరు జరిగింది. ఇందులో వైసీపీ అభ్యర్థిపై జనసేన అభ్యర్థి విజయం సాధించారు. 18 ఓట్ల మెజార్టీతో ఆమెను విజయం వరించింది.



చైనా స్పేస్‌స్టేషన్‌కు వెళ్లనున్న పాకిస్థానీ ఆస్ట్రోనాట్

బీజింగ్: చైనా అంతరిక్ష కేంద్రానికి పాకిస్థానీ వ్యోమగామి వెళ్లనున్నారు. షెంజూ 24 వ్యోమనౌకలో ఆ ఆస్ట్రోనాట్ ప్రయాణిస్తారు. చైనీస్ స్పేస్ స్టేషన్‌కు వెళ్తున్న తొలి విదేశీ వ్యక్తిగా పాక్ ఆస్ట్రోనాట్ రికార్డు క్రియేట్ చేయనున్నారు. అంతరిక్ష కేంద్రంలో స్వల్ప వ్యవధి పాటు ఆ ఆస్ట్రోనాట్ గడపనున్నారు. షెంజూ 24 మిషన్‌కు చెందిన వివరాలను చైనా అంతరిక్ష సంస్థ వెల్లడించింది. అయితే వ్యోమనౌక ప్రయోగ తేదీని కానీ, లేక పాక్ వ్యోమగామి ఎవరన్నదానిపై చైనా ప్రకటన చేయలేదు. చైనా అంతరిక్ష చరిత్రలో తొలిసారి రెండు దేశాలు సంయుక్తంగా మిషన్ చేపట్టనున్నాయి. పాకిస్థానీ ఆస్ట్రోనాట్.. ఓ పేలోడ్ స్పెషలిస్టు తరహాలో ఆ జర్నీలో ఉంటారని చైనా మీడియా పేర్కొన్నది. ప్రస్తుతం చైనాలో ఇద్దరు పాకిస్థానీ వ్యక్తులు వ్యోమగాములుగా శిక్షణ పొందుతున్నారు. మొహమ్మద్ జీషాన్ అలీ, ఖుర్రం దౌద్.. చైనీస్ వ్యోమగాములతో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఇద్దరిలో ఒకరు చైనా అంతరిక్ష కేంద్రానికి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. 2025 ఫిబ్రవరిలో కుదిరిన అగ్రిమెంట్ ఆధారంగా ఈ మిషన్ చేపట్టనున్నారు. పాకిస్థాన్ కూడా ఇటీవల తన స్పేస్ ప్రోగ్రామ్ గురించి వెల్లడించింది. 2035 నాటికి చంద్రుడిపైకి వెళ్తామని మంత్రి అషాన్ ఇక్బాల్ తెలిపారు. పాకిస్థాన్ నిర్మిత లూనార్ రోవర్‌ను చైనాకు చెందిన చేంజ్ 8 మిషన్ ద్వారా పంపనున్నారు. 2028లో ఈ ప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు చైనా మాత్రం 2030 నాటికి చంద్రుడిపై వ్యోమగాములను దింపేందుకు ప్రయత్నిస్తోంది. ఇక 2035 నాటికి భారత్ తన స్వంత స్పేస్ స్టేషన్ నిర్మించే ప్రయత్నాలు కొనసాగిస్తోంది. చంద్రుడిపైకి 2040 నాటికి ఆస్ట్రోనాట్‌ను పంపేందుకు చూస్తోంది.



చరిత్ర సృష్టించిన ఐఎల్76 విమానం..
న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ల్యాండింగ్

న్యూఢిల్లీ: భారతీయ వైమానిక దళానికి చెందిన ఐఎల్76ఎండీ వ్యూహాత్మక రవాణా విమానం చరిత్ర సృష్టించింది. అత్యంత విజయవంతంగా న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ల్యాండ్ అయ్యింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఆల్టిట్యూడ్‌లో ఈ విమానం ల్యాండ్ కావడం కొత్త మైలురాయిగా నిలిచింది. ఐఎల్76 విమానానికి చెందిన నైపుణ్యం, ప్రిసిషన్, సిబ్బంది ప్రదర్శించిన ప్రొఫెషనలిజం అమోఘమని ఐఏఎఫ్ తన స్టేట్‌మెంట్‌లో తెలిపింది. దక్షిణ లాడాఖ్‌లో.. వాస్తవాదీన రేఖకు 40 కిలోమీటర్ల దూరంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌ను కొత్తగా నిర్మించారు. గత ఏడాదే దీని నిర్మాణం పూర్తి అయ్యింది. గతంలో ఈ ప్రాంతానికి ఏఎన్32, హెలికాప్టర్ల ద్వారా రవాణా సాగించేవారు. ఇప్పుడు ఫైటర్ విమానాలను కూడా ఆపరేట్ చేసే స్థాయిలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ తయారైనట్లు ఐఏఎఫ్ తన ప్రకటనలో తెలిపింది.



భారతీయ వ్యూహాత్మక వైమానిక సామర్థ్యంలో కొత్త మైలురాయి లిఖించినట్లు అవుతుందని ఐఏఎఫ్ చెప్పింది. 1980 మధ్య దశకంలో ఐఎల్76 రవాణా విమానాలు భారతీయ వైమానిక దళంలో చేరాయి. హెవీ లిఫ్టింగ్‌లో కొత్త చరిత్ర సృష్టించాయి. ఈ విమానాలు 45 టన్నుల బరువును మోయగలవు. లడాఖ్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాలకు యుద్ధ ట్యాంకులు, యుద్ధ వాహనాలు, అతిభారీ ఎక్విప్మెంట్‌ను ఈ విమానం తరలించగలదు. లేహ్‌తో పాటు తోసి ప్రాంతాలకు లాజిస్టిక్ మిషన్‌లో భాగంగా ఐఎల్ 76 విమానాలు వెళ్తుంటాయి. న్యోమా ఎయిర్‌ఫీల్డ్ సముద్ర మట్టానికి సుమారు 10 వేల ఫీట్ల ఎత్తులో ఉన్నది. సియాచిన్‌లో ఆపరేషన్స్ చేపట్టేందుకు ఈ ఎయిర్‌ఫీల్డ్ కీలకంకానున్నది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ కు చెందిన ప్రాజెక్టు హిమాంక్‌లో భాగంగా 3 కిలోమీటర్ల పొడువైన కాంక్రీట్ రన్‌వేను న్యోమాలో నిర్మించారు.అయితే ఇక్కడ ఉన్న అతిశీతల వాతావరణాన్ని తట్టుకునే రీతిలో దీన్ని నిర్మించారు.

రోగి గాయం తీవ్రం కాదన్న డాక్టర్.. దాడి చేసిన పోలీస్, వీడియో వైరల్

ముంబై: చేతికి గాయమైన కొడుకును ఒక పోలీస్ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన డాక్టర్ ఆ గాయం తీవ్రమైనది కాదని అన్నారు. ఆగ్రహించిన ఆ పోలీస్, ఆయన కుమారుడు కలిసి ఆ డాక్టర్‌పై దాడి చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. నవంబర్ 4న నాగ్‌పూర్ నగర పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ కుమారుడు బైక్ టైన్ క్లీనింగ్ చేస్తుండగా చేతికి స్వల్ప గాయమైంది. దీంతో చికిత్స కోసం కుమారుడిని నాగ్‌పూర్‌లోని ఇందిరా గాంధీ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి ఆ పోలీస్ అధికారి తీసుకెళ్లారు.
కాగా, ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న తర్వాత తన కుమారుడికి తక్షణం చికిత్స అందించాలని ఆ పోలీస్ అధికారి డిమాండ్ చేశారు. ఒక రెసిడెంట్ డాక్టర్ ఆ వ్యక్తి గాయాన్ని పరిశీలించారు. అది స్వల్ప గాయమని, ఇంటికి తీసుకువెళ్లి డ్రెస్సింగ్ చేయమని సలహా ఇచ్చారు. మరింత తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగికి ఆ డాక్టర్ ప్రాధాన్యత ఇవ్వడంతో ఆ పోలీస్ అధికారికి కోపం వచ్చింది. దీంతో వారి మధ్య వాగ్వాదం చెలరేగింది.



మరోవైపు ఆ పోలీస్, ఆయన కుమారుడు కలిసి ఉన్నట్టుండి ఆ డాక్టర్‌పై దాడి చేశారు. రోగి ఉన్న బెడ్‌పైకి ఆయనను తోసివేశారు. ఆ తర్వాత కూడా వారి మధ్య వాగ్వాదం కొనసాగింది, చివరకు భద్రతా సిబ్బంది జోక్యం చేసుకున్నారు. ఆ పోలీస్, ఆయన కుమారుడ్ని డాక్టర్ రూమ్ నుంచి బయటకు తీసుకువెళ్లారు.
కాగా, తనపై జరిగిన దాడి గురించి ఆ డాక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ డాక్టర్ తమపై దాడి చేసినట్లు పోలీస్ అధికారి, ఆయన కుమారుడు కూడా ప్రతిగా ఫిర్యాదు చేశారు. దీంతో ఇరుపక్షాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.
అయితే తమ సహోద్యోగిపై జరిగిన దాడిని మహారాష్ట్ర రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఖండించింది. దాడికి గురైన డాక్టర్‌పైనే కేసు నమోదు చేయడాన్ని తప్పుపట్టింది. డాక్టర్‌పై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలని, నిందితులను అరెస్ట్ చేయాలని, ఆ పోలీస్ అధికారిని సస్పెండ్ చేయాలని రెసిడెంట్ డాక్టర్లు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. హాస్పిటల్‌లోని సీసీటీవీలో రికార్డైన డాక్టర్‌పై దాడికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది: రాజ్‌నాథ్ సింగ్

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు.
'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి మన సైనికులు డ్రోన్లను ప్రయోగించడం, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త యుద్ధ పద్ధతులను నేర్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో సాంకేతికనే ఆయుధంగా చేసుకునేలా మన దళాలు మరింత మెరుగవ్వాలి. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్‌లు, పరిశ్రమలు.. డ్రోన్‌లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్నిరకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదే సమయంలో దేశ సరిహద్దుల్లో సైనికులు అక్కడి ప్రజలతో బలమైన సంబంధాలు కొనసాగించాలని రక్షణ మంత్రి సూచించారు. అలా అయితేనే దేశంలో కల్లోలం సృష్టించేందుకు శత్రువులు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టగలమన్నారు.



ప్రతి విషయాన్ని విచారించే అధికారం ఈడీకి లేదు: కర్ణాటక హైకోర్టు

కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారాలపై కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన దృష్టికి వచ్చిన ప్రతీ విషయాన్ని విచారించే అధికారం ఆ సంస్థకు లేదని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టడానికి చట్టబద్ధమైన నిబంధనలను దాటవేసే అధికారం దానికి లేదని స్పష్టం చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యా కింద.. ఈడీకి ఉన్న అధికారాల పరిధిలో లేని నేరాలపై ఆ చట్టం కింద విచారణ చేపట్టవద్దని ఆదేశించింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజగౌడ, ఆయనతో సంబంధం ఉన్న ఇతరులతో సహా పలువురు పిటిషనర్లపై దర్యాప్తు సంస్థ చేపట్టిన విచారణలను జస్టిస్ ఎంఐ అరుణ్ కొట్టేశారు. ఆస్తుల జప్తును ధ్రువీకరిస్తూ పీఎంఎల్ఏ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు కొట్టివేసింది. అలాగే, పిటిషనర్లలో ఒకరి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. కోలారు, చిక్కబళ్లాపుర జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ లిమిటెడ్ (కోముల్)లోని ఉద్యోగుల నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఇటీవల ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తును సవాల్ చేస్తూ.. నమోదైన పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ అవకతవకలపై ఎఫ్ఐఆర్ లేదా, అధికారిక క్రిమినల్ కేసు నమోదయితేనే ఈడీకి దర్యాప్తు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. అంతే కానీ మనీలాండరింగ్ ఆరోపణలను సుమోటోగా తీసుకొని దర్యాప్తు చేపట్టడం సరైన చర్య కాదని పేర్కొంది.





రండి, మా పైనుంచే బుల్డోజర్లు నడపండి..
బెంగాల్ సర్కారుపై మమతాబెనర్జి ఫైర్..!

బీజేపీ నేతృత్వంలోని పశ్చిమబెంగాల్ సర్కారు పై ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జి ఆగ్రహం వ్యక్తంచేశారు. కోల్‌కతా లోని ఓ క్లబ్ ముందు ప్రధాన రహదారిపై ప్రభుత్వం పూజా కార్యక్రమాలను నిర్వహించడంపై విమర్శలు గుప్పించారు. రోడ్డుపై పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ పనులు తాము చేసుకోనివ్వలేదని ఆరోపించారు. నడి రోడ్డుపై పూజా కార్యక్రమాలకు ప్రభుత్వం అక్రమంగా అనుమతులు ఇచ్చిందని మండిపడ్డారు.
గతంలో అక్కడ ఎప్పుడూ రోడ్డుపై పూజ జరగలేదని, పూజలు లోపల జరిగేవని గుర్తుచేశారు. శుక్రవారం రాత్రి వారు రహదారి మూల మలుపు వద్దే పూజ నిర్వహించారని, దాంతో తాము తమ సొంత పూజా కార్యక్రమానికి వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోయిందని విమర్శించారు. ఇది పూర్తిగా అహంకారపూరితమైన, అణచివేత చర్య అని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీరు బుల్డోజర్లను తీసుకురావాలనుకుంటున్నారా.. అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే రండి, మా శరీరాల మీద నుంచే మీ బుల్డోజర్లను నడపండి అని ఆగ్రహంతో అన్నారు.

పార్కింగ్ వివాదం.. 15 రౌండ్ల కాల్పులు..
టెక్ మహేంద్ర మాజీ ఉద్యోగి మృతి



ఫరీదాబాద్: ధంతేరాస్ రాత్రి వేళ ఫరీదాబాద్‌లో దారుణం జరిగింది. సెక్టార్ 21సీలో పార్కింగ్ వివాదం ఒకరి ప్రాణాలను బలిగొన్నది. పరమ్‌జీత్ ధంకర్ అనే వ్యక్తిని అపార్ట్‌మెంట్‌కు చెందిన మరో వ్యక్తి కాల్చి చంపాడు. నిందితుడిని మోహన్ అలియాస్ సోనూ శర్మగా గుర్తించారు. లైసెన్స్ పిస్తోల్‌తో అతను కాల్పులు జరిపినట్లు తేల్చారు. సుమారు 15 రౌండ్ల ఫైరింగ్ జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. పరంజీత్‌కు నాలుగు బుల్లెట్లు దిగాయి. గతంలో పరంజీత్ టెక్ మహేంద్ర కంపెనీలో రీజినల్ హెడ్‌గా పనిచేశారు. అపార్ట్‌మెంట్‌లోని ఫస్ట్ ఫ్లోర్ 641 ఇంటి నెంబర్‌లో పరంజీత్ నివసిస్తున్నాడు. ప్రస్తుతం సింగపూర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో అతను ఉద్యోగం చేస్తున్నాడు.
మేనల్లుడి పెళ్లి కోసం రెండు రోజుల క్రితం అతను ఫరీదాబాద్ చేరుకున్నాడు. నవంబర్ 24వ తేదీన పెళ్లి జరగాల్సి ఉంది. శుక్రవారం రాత్రి 8 గంటలకు జిమ్ నుంచి తిరిగివచ్చిన పరంజీత్, మోహన్ మధ్య వాగ్వాదం జరిగింది. ఆ బిల్డింగ్‌లోనే మూడవ ఫ్లోర్‌లో మోహన్ నివసిస్తున్నాడు. అయితే వెహికల్ పార్కింగ్ గురించి గొడవ జరిగిందా లేక పెంపుడు కుక్క గురించి ఘర్షణ మొదలైందా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వాగ్వదం ముదరడంతో.. మోహన్ తన వద్ద ఉన్న గన్‌తో పరంజీత్‌ను షూట్ చేశాడు.
పోలీసుల ప్రకారం ఆ రెండు కుటుంబాల మధ్య చాన్నాళ్ల నుంచి గొడవలు ఉన్నాయి. అయితే కొన్ని రోజుల క్రితమే పరంజీత్ కుమారుడిని మోహన్ తిట్టినట్లు తెలుస్తోంది. కాల్పుల ఘటన తర్వాత మోహన పరారీలో ఉన్నాడు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

నిర్మాణంలో ఉన్న స్లాబ్ కూలి కార్మికుడు మృతి.. నలుగురికి గాయాలు



లక్నో: నిర్మాణంలో ఉన్న ఒక ఇంటికి స్లాబ్ వేస్తుండగా అది కూలిపోయింది. ఆ సమయంలో పని చేస్తున్న కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. పోలీసులు, సహాయక సిబ్బంది కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఒక కూలీ మరణించగా మరో నలుగురు గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మోదీనగర్‌లోని సిక్రి గ్రామంలో ఒక ఇంటిని నిర్మిస్తున్నారు. శనివారం కాంక్రీట్ స్లాబ్ వేస్తుండగా సెంట్రింగ్ కూలిపోయింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఆ శిథిలాల కింద చిక్కుకున్నారు.
కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న ఐదుగురు కార్మికులను రక్షించారు. వారిని ఆసుపత్రికి తరలించగా ఒక కార్మికుడు మరణించాడు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | రంగారెడ్డి
08.11.2026



డిజిటల్ సార్వభౌమత్వం

ఒక దేశం తన డేటాతో పాటు డిజిటల్ మౌలిక వసతులూ, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, నెట్‌వర్క్ వ్యవస్థలూ, సాంకేతిక నియమాలపై పూర్తి నియంత్రణ కలిగి ఉండటం చాలా కీలకం. దీన్నే 'డిజిటల్ సార్వభౌమత్వం' అంటారు. ప్రజల వ్యక్తిగత సమాచారం, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, సాంకేతిక పురోగతిని విదేశాలు, బాహ్య శక్తుల జోక్యం నుంచి కాపాడే రక్షా కవచంగా ఇది ఉపయోగపడుతుంది. అలాంటి సంపూర్ణ సైబర్ సార్వభౌమత్వాన్ని భారత్ ఎప్పుడు సాధిస్తుంది?

డిజిటల్ సార్వభౌమత్వం లేదా సైబర్ స్వయంపాలన అనేది ప్రధానంగా నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంటుంది. మొదటిది, 'డేటా సావర్నిటీ'. అంటే ప్రజల వ్యక్తిగత వివరాలు, జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని దేశంలోనే సురక్షితంగా భద్రపరచడం. తద్వారా విదేశీ ప్రభుత్వాలు క్లౌడ్ ఆధారిత నిఘా పెట్టకుండా నిరోధించగలం. 'మౌలిక వసతుల్లో స్వావలంబన' రెండోది. అంటే క్లౌడ్ డేటా సెంటర్లు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లు, కమ్యూనికేషన్ టవర్లు, శాటిలైట్ కమ్యూనికేషన్లపై స్వదేశీ నియంత్రణ ఉండటం. మూడోది, 'సాంకేతిక ఆధారిత స్వయంసమృద్ధి'. ఆపరేటింగ్ సిస్టమ్‌లు, సెమీకండక్టర్ లేదా చిప్ డిజైన్, ఏఐ మోడల్స్, సైబర్ సెక్యూరిటీ టూల్స్ కోసం విదేశీ కంపెనీలపై ఆధారపడకుండా, స్వదేశీ పరిష్కారాలను అభివృద్ధి చేసుకోవడం. 'చట్టపరమైన నియంత్రణాధికారం' ఏమో నాలుగో స్తంభం. స్వదేశీ నిబంధనలను ఉల్లంఘించే విదేశీ టెక్ కంపెనీలపై ఆంక్షలు, పన్నులు విధించే చట్టపరమైన అధికారాన్ని ప్రభుత్వం కలిగి ఉండటం. ఇటువంటి కట్టుదిట్టమైన ఏర్పాట్లు లేకుంటే పౌరులూ సమాజం తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదు.

ఆదర్శం... ఈయూ విధానం!

డిజిటల్ సార్వభౌమత్వం లేకపోతే, పౌరుల వ్యక్తిగత గోప్యతకు భద్రత ఉండదు. ఆర్థిక లావాదేవీల వివరాలు, ఆరోగ్య సమాచారం, వ్యక్తిగత సంభాషణలు, రాజకీయ అభిప్రాయాలు వంటివి విదేశీ టెక్ కంపెనీలు, నిఘా సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. డిజిటల్ చెల్లింపులు, ఇ-కామర్స్, క్లౌడ్ సేవల కోసం విదేశీ కంపెనీలపై ఆధారపడితే చిన్నపాటి స్వదేశీ వ్యాపారాలు దెబ్బతినిపోతాయి. అంతర్జాతీయ వివాదాలు తలెత్తినప్పుడు ఆయా కంపెనీలు సేవలను నిలిపేస్తే దేశార్థిక వ్యవస్థ క్షణాల్లో స్తంభించిపోతుంది. విదేశీ సోషల్ మీడియా అల్గారిథమ్‌లు ఒక దేశ ఎన్నికలను దారిమళ్లించడానికీ, వివిధ సామాజిక వర్గాల మధ్య ద్వేషం పెంచడానికీ ప్రయత్నించవచ్చు. విద్యుత్ గ్రిడ్‌లు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, ఆసుపత్రులు, రవాణా వ్యవస్థలు విదేశీ సాఫ్ట్‌వేర్, క్లౌడ్‌పై ఆధారపడితే- శత్రుదేశాలు సైబర్ దాడులు, రిమోట్ ఆపరేటింగ్ సిస్టమ్‌లను ఉపయోగించి ఒక దేశాన్ని రాత్రికి రాత్రే అంధకారంలోకి నెట్టేసే ప్రమాదమూ ఉంటుంది.

డిజిటల్ సార్వభౌమత్వం విషయంలో యూరోపియన్ యూనియన్(ఈయూ) అనుసరిస్తున్న పౌరహక్కుల ఆధారిత నమూనా ఎంతో ఆదర్శవంతమైనది. ఇది ప్రధానంగా వ్యక్తిగత గోప్యతకు పట్టం కడుతూ, టెక్ సంస్థల ఏకఛత్రాధిపత్యాన్ని అరికట్టడంపై దృష్టి పెడుతుంది. ప్రత్యామ్నాయ సెర్చ్ ఇంజిన్లను తొక్కిపెట్టినందుకూ, ప్రకటనలపై ఏకఛత్రాధిపత్యం చలాయించినందుకూ, వినియోగదారుల లొకేషన్‌ను ట్రాక్ చేసినందుకు గూగుల్ వంటి దిగ్గజ కంపెనీలకు భారీ జరిమానాలు విధించింది ఈయూ! తమ చట్టాలకు లోబడి నడుచుకోవాల్సిందేనని వాటికి తేల్చిచెప్పింది. చైనా, రష్యాలేమో ప్రభుత్వాలకే పూర్తి నియంత్రణ ఉండే విధానాన్ని అనుసరిస్తున్నాయి. అమెరికా మాత్రం ప్రైవేటు రంగానికీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిచ్చే పద్ధతిని చేపట్టింది. అయితే, ఇంటర్నెట్ స్వయంపాలనలో ఇండియా మార్గదర్శకంగా నిలుస్తోంది. ఆధార్ గుర్తింపు వ్యవస్థను నిర్మించడంతో పాటు యూపీఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను స్వదేశీ నెట్‌వర్క్ పరిధిలోకి తెచ్చింది. తద్వారా విదేశీ కార్డ్ నెట్‌వర్క్‌ల ఆధిపత్యాన్ని తగ్గించింది. ఇ-కామర్స్‌లో విదేశీ సంస్థల ఏకఛత్రాధిపత్యానికి అడ్డుకట్ట వేసింది. ప్రజల వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రతను దృష్టిలో పెట్టుకుని వందలాది విదేశీ యాప్‌లను నిషేధించడం ద్వారా భారత్ తన డిజిటల్ సార్వభౌమత్వాన్ని నిరూపించుకుంది. అయితే, 'డిజిటల్ వ్యక్తిగత డేటా సంరక్షణ చట్టం-2023' వీటన్నింటిలో కీలకమైనది. ఇది ప్రజలకు వ్యక్తిగత సమాచారంపై పూర్తి హక్కులను కల్పించడంతో పాటు, ఉల్లంఘనలకు పాల్పడే కంపెనీలపై రూ.250కోట్ల వరకు జరిమానాలు విధించే నిబంధనలను తీసుకొచ్చింది. అయితే, దీన్ని అనుసరించి సమాచార హక్కు చట్టాన్ని సవరించడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగుల ఆస్తుల వివరాలు, అవినీతి ఆరోపణల రికార్డులను వ్యక్తిగత సమాచారమనే సాకుతో తిరస్కరించే అవకాశం ఏర్పడింది.

కీలక నిర్ణయాలతోనే సాధ్యం

చెప్పాలంటే, భారత్ ఇప్పటికీ స్మార్ట్‌ఫోన్లు, సర్వర్లు, టెలికాం పరికరాలు, సెమీకండక్టర్లు, చిప్‌ల కోసం విదేశాలపై ఆధారపడుతోంది. ప్రజలు, వ్యవస్థలకు సంబంధించిన డేటా చాలామటుకు క్లౌడ్ సర్వర్లలోనే నిల్వ ఉండిపోతోంది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు అధికంగా విదేశీ ఆపరేటింగ్ సిస్టమ్‌లపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. ఏఐ రంగంలో బిగ్ లాంగ్వేజ్ మోడళ్లు, ప్రాసెసింగ్ జీపీయూల కోసం విదేశీ టెక్నాలజీపై ఆధారపడటం వల్ల భవిష్యత్తులో సాంకేతిక పరాధీనతకు దారితీసే ప్రమాదముంది.

ఇండియా సంపూర్ణ సైబర్ సార్వభౌమత్వ దేశంగా మారడానికి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. సెమీకండక్టర్ మిషన్ ద్వారా స్వదేశీ చిప్ డిజైన్, ప్రాసెసింగ్ ఫ్యాబ్రికేషన్ యూనిట్ల స్థాపనను వేగవంతం చేయాలి. భారతీయ భాషలు, సంస్కృతిని ప్రతిబింబించే రీతిలో 'భాషిణి' వంటి స్థానిక ఏఐ మోడళ్లకు మద్దతివ్వాలి. డేటా సర్వర్లు, స్వదేశీ క్లౌడ్ వసతులను ఏర్పాటుచేసుకుని... ప్రజలు, ప్రభుత్వ డేటాను స్థానికంగానే భద్రపరచాలి. రక్షణ వంటి సర్కారీ యంత్రాంగాల్లో స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్‌లను దశలవారీగా తప్పనిసరి చేయాలి. సైబర్ సెక్యూరిటీ వ్యూహాన్ని నవీకరించి, విద్యుత్ గ్రిడ్ వంటి మౌలిక సదుపాయాలను క్వాంటమ్-రెసిస్టెంట్ ఎన్‌క్రిప్షన్‌కు తరలించాలి. తద్వారా శత్రుదేశాల సైబర్ యుద్ధాల నుంచి దేశాన్ని సురక్షితంగా కాపాడుకోవచ్చు. పౌరుల వ్యక్తిగత గోప్యత, ప్రజాస్వామ్య పారదర్శకతల మధ్య సమతుల్యత సాధిస్తూ హార్డ్‌వేర్, సెమీకండక్టర్లు, ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో తీసుకునే నిర్ణయాలే... భారత్ సంపూర్ణ డిజిటల్ సార్వభౌమత్వాన్ని సాధిస్తుందో లేదో నిర్ణయిస్తాయి.



ఓబీసీ క్రీమీ లేయర్ తీర్పు:
గందరగోళం లేకుండా స్పష్టత

అన్యాయాన్ని సరిదిద్దుతూనే పరిపాలనా వ్యవస్థలో అస్థిరత రాకుండా సుప్రీంకోర్టు కీలక సమతుల్యత

ఓబీసీ క్రీమీ లేయర్ అంశంపై సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన స్పష్టీకరణ కేవలం రిజర్వేషన్ల విధానానికే సంబంధించినది కాదు. వ్యక్తిగత హక్కులు, రాజ్యాంగబద్ధమైన సమానత్వం, పరిపాలనా స్థిరత్వం మధ్య సమతుల్యతను సాధించే ప్రయత్నంగా దీనిని చూడాలి.2026 నవంబర్ 6న సుప్రీంకోర్టు, ఓబీసీ క్రీమీ లేయర్ హోదా నిర్ణయానికి సంబంధించి మార్చి 11న ఇచ్చిన తీర్పును గత నియామకాలను తిరిగి తెరవాలని, సీనియారిటీ జాబితాలను సవరించాలని లేదా గత సంవత్సరాల్లో జరిగిన సర్వీసు కేటాయింపులను పూర్తిగా పునఃసమీక్షించాలని అర్థం చేసుకోరాదని స్పష్టం చేసింది.ఈ స్పష్టీకరణ అత్యంత కీలకమైన సమయంలో వచ్చింది. మార్చి తీర్పును గతానికి వర్తింపజేస్తే, గత పదేళ్లలో భర్తీ చేసిన లక్షలాది రిజర్వుడు పోస్టులు, నియామకాలు ప్రభావితమవుతాయని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల సీనియారిటీ, పదోన్నతులు, వేతనాలు, సర్వీసు కేటాయింపులపై అనేక వివాదాలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంది. ఈ ఆందోళన పూర్తిగా నిరాధారమైనది కాదు. న్యాయపరంగా సరైన ఉద్దేశంతో ఇచ్చిన తీర్పును గతానికి యథాతథంగా వర్తింపజేస్తే, అది పరిపాలనా వ్యవస్థలో తీవ్రమైన అనిశ్చితికి దారితీసే అవకాశం ఉంది.అయితే, సుప్రీంకోర్టు ఇప్పుడు ఈ విషయంలో స్పష్టమైన, సముచితమైన గీతను గీసింది.



అభ్యర్థులకు న్యాయం... వ్యవస్థలకు స్థిరత్వం

ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాలను నిరాకరించడానికి కేవలం తల్లిదండ్రుల జీతాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకోరాదని మార్చి 11 తీర్పు పేర్కొంది. క్రీమీ లేయర్ హోదా నిర్ణయం ఆదాయం, సంపదకు సంబంధించిన చట్టబద్ధమైన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది.అయితే, తాజా ఉత్తర్వు మరో కీలక విషయాన్ని స్పష్టం చేసింది. ఈ న్యాయ వివరణ కారణంగా గతంలో జరిగిన ప్రతి నియామకం లేదా ఎంపిక ప్రక్రియ స్వయంచాలకంగా చెల్లుబాటు కాకుండా పోదని పేర్కొంది.మార్చి 11 తీర్పు సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థుల హక్కులను మాత్రమే నిర్ణయించిందని న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలో పూర్తయిన అన్ని ఎంపికలను తిరిగి పరిశీలించాలన్నది లేదా అసలు కేసులో భాగస్వాములు కాని వారి హక్కులను దెబ్బతీయాలన్నది ఆ తీర్పు ఉద్దేశం కాదని పేర్కొంది.ఇది ఒక ముఖ్యమైన న్యాయసూత్రాన్ని గుర్తుచేస్తుంది—ఒక అన్యాయాన్ని సరిదిద్దడం కోసం మరో అన్యాయానికి కారణం కావాల్సిన అవసరం లేదు.గతంలో పూర్తయిన నియామకాలు, సర్వీసు కేటాయింపులను విచక్షణారహితంగా తిరిగి తెరిస్తే దాని పరిణామాలు తీవ్రంగా ఉండేవి. ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగుల సీనియారిటీ, పదోన్నతుల విషయంలో అనిశ్చితి ఏర్పడేది. ప్రభుత్వ శాఖలు అంతులేని న్యాయ వివాదాల్లో చిక్కుకునేవి. విద్యా సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలు కూడా చాలా కాలం క్రితమే ముగిసిన నిర్ణయాలను తిరిగి పరిశీలించాల్సిన పరిస్థితి ఏర్పడేది.సుప్రీంకోర్టు తాజా స్పష్టీకరణ ఇటువంటి గందరగోళాన్ని నివారించింది.

సీఎస్ఈ–2025 విషయంలో ప్రత్యేక పరిస్థితి

అయితే, 2025 సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థుల విషయంలో సుప్రీంకోర్టు మరో ముఖ్యమైన వ్యత్యాసాన్ని గుర్తించింది.మార్చి 11 తీర్పుకు ముందే పరీక్ష ఫలితాలు ప్రకటించినప్పటికీ, విజయం సాధించిన అభ్యర్థులకు సర్వీసుల కేటాయింపు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. అందువల్ల, క్రీమీ లేయర్ సూత్రానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన న్యాయ వివరణను అమలు చేయడాన్ని వాయిదా వేయడానికి ఎటువంటి సమంజసమైన కారణం లేదని న్యాయస్థానం పేర్కొంది.ఫలితంగా, 2025 సివిల్ సర్వీసెస్ పరీక్ష ద్వారా ఎంపికైన అర్హులైన ఓబీసీ అభ్యర్థులకు సర్వీసుల కేటాయింపులో మార్చి 11 తీర్పులో పేర్కొన్న క్రీమీ లేయర్ సూత్రం వర్తిస్తుంది.ఈ విధానం న్యాయసమ్మతమైన ఒక ప్రాథమిక సూత్రాన్ని ప్రతిబింబిస్తుంది: ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నప్పుడు, చట్టాన్ని రాజ్యాంగ న్యాయస్థానం సరైన విధంగా వివరించిన మేరకు ఆ ప్రక్రియను పూర్తి చేయాలి. ఒకసారి ప్రక్రియ పూర్తై, నిర్ణయాలు స్థిరపడిన తర్వాత వాటిని ప్రత్యేక న్యాయపరమైన ఆదేశం లేకుండా తిరిగి తెరవడం వ్యవస్థలో స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది.ఈ స్పష్టీకరణ వల్ల సర్వీసు, క్యాడర్ కేటాయింపులు మరియు ఫౌండేషన్ కోర్సు ప్రారంభంపై నెలకొన్న అనిశ్చితి తొలగి, 2025 సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు ఊరట లభించే అవకాశం ఉంది.

ప్రభుత్వానికి సమతుల్యమైన సందేశం

గత పదేళ్లలో భర్తీ చేసిన 6.69 లక్షలకు పైగా రిజర్వుడు ఖాళీలు ఈ తీర్పు కారణంగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఇందులో సుమారు 3.7 లక్షల ఓబీసీ పోస్టులు కూడా ఉన్నాయని పేర్కొంది. అయితే, తన తీర్పు కారణంగా గత నియామకాలు, సర్వీసు కేటాయింపులు లేదా సీనియారిటీని సమగ్రంగా సవరించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఆ భయాలకు తెరపడింది.అదే సమయంలో, ఇతర కోర్టులు, ట్రిబ్యునళ్లలో ఇలాంటి అంశాలపై పెండింగ్‌లో ఉన్న కేసులను సంబంధిత న్యాయస్థానాలు మార్చి 11 తీర్పులో నిర్దేశించిన న్యాయ సూత్రాల ప్రకారం, ఒక్కో కేసు ప్రత్యేక పరిస్థితులను పరిశీలించి పరిష్కరించాలని సుప్రీంకోర్టు పేర్కొంది.దీని ద్వారా న్యాయం కోసం న్యాయస్థానాల తలుపులు తెరిచే ఉంటాయి. అదే సమయంలో మొత్తం పరిపాలనా వ్యవస్థ గందరగోళంలో పడకుండా రక్షణ లభిస్తుంది.రిజర్వేషన్ విధానం, క్రీమీ లేయర్ ప్రమాణాలకు సంబంధించి రాజ్యాంగానికి అనుగుణంగా విధానాలను రూపొందించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం, శాసన వ్యవస్థ పరిధిలోనే ఉందని కూడా న్యాయస్థానం స్పష్టం చేసింది. అధికార విభజన అనే రాజ్యాంగ సూత్రాన్ని ఇది మరోసారి గుర్తుచేస్తోంది. న్యాయస్థానాలు చట్టాన్ని వ్యాఖ్యానిస్తాయి, హక్కులను పరిరక్షిస్తాయి; ప్రభుత్వాలు మాత్రం స్పష్టమైన, ఆచరణయోగ్యమైన, రాజ్యాంగబద్ధమైన విధానాలను రూపొందించాలి.

స్పష్టమైన క్రీమీ లేయర్ విధానం అవసరం

ఈ వివాదం రిజర్వేషన్ విధానంలో ఉన్న ఒక పెద్ద సవాలును కూడా బయటపెట్టింది. సామాజిక న్యాయం కోసం భారతదేశం అమలు చేస్తున్న అత్యంత కీలకమైన సాధనాల్లో రిజర్వేషన్ ఒకటి. అయితే, దాని అమలులో స్పష్టత లేకపోతే న్యాయ వివాదాలు, అనిశ్చితి తప్పవు.వెనుకబడిన వర్గాల్లో నిజంగా ప్రభుత్వ సహాయం అవసరమైన వారికి రిజర్వేషన్ ప్రయోజనాలు చేరాలన్న ఉద్దేశంతోనే క్రీమీ లేయర్ సూత్రం రూపొందించబడింది. అయితే, క్రీమీ లేయర్‌ను గుర్తించడానికి ఉపయోగించే ప్రమాణాలు పారదర్శకంగా, హేతుబద్ధంగా, దేశవ్యాప్తంగా ఒకే విధంగా అమలయ్యేలా ఉండాలి.ప్రస్తుత పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం ఒక అవకాశంగా తీసుకొని, క్రీమీ లేయర్‌కు సంబంధించిన నిబంధనలను సమీక్షించి మరింత స్పష్టత తీసుకురావాలి. ఆదాయం, సంపద, తల్లిదండ్రుల ఉద్యోగ హోదా, సమాన స్థాయి పోస్టుల నిర్ణయం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందిస్తే అనవసరమైన వివాదాలు తగ్గుతాయి. భిన్నమైన వ్యాఖ్యానాల కారణంగా అర్హులైన అభ్యర్థులు తమ హక్కులను కోల్పోయే పరిస్థితి ఉండకూడదు. సామాజిక న్యాయం పరిపాలనా అస్పష్టతపై ఆధారపడకూడదు.

గందరగోళం లేకుండా స్పష్టత

సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వు రాజ్యాంగ పాలనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. న్యాయస్థాన తీర్పులు హక్కులను పరిరక్షించాలి, చట్టపరమైన తప్పులను సరిదిద్దాలి. అయితే, ఇప్పటికే స్థిరపడిన వ్యవస్థలను, పూర్తయిన ప్రక్రియలను అనవసరంగా కుదిపివేయడం వల్ల కలిగే పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.ఈ విషయంలో సుప్రీంకోర్టు ఒక సున్నితమైన సమతుల్యతను సాధించింది. క్రీమీ లేయర్ సూత్రంపై ఇచ్చిన న్యాయ వివరణను సివిల్ సర్వీసెస్ పరీక్ష-2025 వంటి ఇంకా పూర్తికాని ప్రక్రియలకు వర్తింపజేస్తూనే, ఇప్పటికే ముగిసిన నియామకాలు, సర్వీసు కేటాయింపులు, సీనియారిటీ హక్కులకు రక్షణ కల్పించింది.సారాంశంగా చెప్పాలంటే, ఈ తీర్పు సందేశం స్పష్టంగా ఉంది: అన్యాయాన్ని సరిదిద్దడానికి చట్టం ముందుకు సాగాలి; కానీ కొత్త అనిశ్చితిని సృష్టించడానికి తప్పనిసరిగా గతంలోకి వెళ్లాల్సిన అవసరం లేదు.ఓబీసీ అభ్యర్థులకు క్రీమీ లేయర్ సూత్రం అమలుపై ఈ తీర్పు మరింత స్పష్టతను అందిస్తుంది. 2025 సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకు సర్వీసు కేటాయింపుపై నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తుంది. అదే సమయంలో, రిజర్వేషన్ విధానాలను కాలానుగుణంగా సమీక్షించి, స్పష్టంగా రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మరోసారి గుర్తుచేస్తుంది.ఇప్పుడు అసలు బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థపై ఉంది.క్రీమీ లేయర్ విషయంలో పారదర్శకమైన, రాజ్యాంగబద్ధమైన, సామాజికంగా సున్నితమైన విధానం రూపొందించడం అత్యవసరం. అది కేవలం న్యాయ వివాదాలను తగ్గించడానికే కాదు, సమానత్వం, సామాజిక న్యాయం పట్ల భారతదేశం కలిగి ఉన్న రాజ్యాంగబద్ధమైన నిబద్ధతపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడానికి కూడా అవసరం.సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. ఆ స్పష్టతను న్యాయమైన, సమర్థవంతమైన విధానంగా మార్చాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వానిదే.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

సిద్ధమవుతున్న డ్రోన్ల దండు!

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ సమరాన్ని చూస్తే ఆధునిక యుద్ధాల్లో డ్రోన్లు, క్షిపణుల పాత్ర అవగతమవుతుంది. 'ఆపరేషన్ సిందూర్'లో భారత్ తనపై పాకిస్థాన్ ప్రయోగించిన చైనా, తుర్కియే డ్రోన్లను చిత్తుచేసి, తన దాడులను అడ్డుకోజూసిన పాక్ గగనతల రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. ఆ ఉత్సాహంతోనే పోరాట డ్రోన్ల తయారీ, సాంకేతికతల అభివృద్ధి, వినియోగంపై ఇండియా దృష్టి సారిస్తోంది.సరిహద్దులకు ఆవలి లోతట్టు ప్రాంతాలపై దాడులు చేయగల డ్రోన్ల తయారీకి భారత్ మూడు ప్రాజెక్టులు చేపట్టింది. మొదట రూ.39వేల కోట్లతో నాలుగు స్క్వాడ్రన్ల (సుమారు 60) ఘాతక్ స్టెల్త్ మానవ రహిత డ్రోన్ల తయారీకి రక్షణ సామగ్రి సేకరణ మండలి ఆమోదం తెలిపింది. రెండో ప్రాజెక్టు కింద రూ.30వేల కోట్లతో 87 మీడియం-ఆల్టిట్యూడ్ లాంగ్-ఎండ్యూరెన్స్ డ్రోన్ల కోసం బిడ్‌లను ఆహ్వానించింది. తాజాగా రూ.20వేల కోట్లతో నిఘా, దాడి డ్రోన్లు, నింగిలో తచ్చాడుతూ శత్రువుపై విరుచుకుపడే లోయిటరింగ్ మ్యూనిషన్స్ సేకరణ ప్రక్రియ చేపట్టింది. దేశీయ డ్రోన్ల తయారీలో సుమారు 600 కంపెనీలు నిమగ్నం కాగా, వాటిలో వంద సంస్థలు పోరాట డ్రోన్ల తయారీపైనే దృష్టిపెట్టాయి. వీటిలో ముఖ్యమైనవి హైదరాబాద్‌లోనూ ఉన్నాయి.



పాక్‌కు తోడుగా చైనా, తుర్కియే...

డ్రోన్ దళాల నిర్వహణకు భారత్ అయిదేళ్లలో 5లక్షల మంది సిబ్బందిని సమకూర్చుకోనుంది. సైన్యం ఇప్పటివరకు సుమారు 50వేల మందికి శిక్షణ ఇచ్చింది. వీరిని 'అష్మి' పేరిట ప్రత్యేక డ్రోన్ ప్లాటూన్లుగా సమీకరించి, 380 పదాతిదళ బెటాలియన్లలో మోహరించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ వంటి పారామిలిటరీ దళాలూ డ్రోన్ ఆపరేటర్లను తయారు చేస్తున్నాయి. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) మధ్యప్రదేశ్‌లో మొట్టమొదటి డ్రోన్ యుద్ధ పాఠశాలను ప్రారంభించింది.కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) ఒక్కటే హైదరాబాద్, భిలాయ్, బెహ్రోర్ వంటి చోట్ల ప్రత్యేక శిక్షణ పాఠశాలలను స్థాపించి, ఏడు వేల మందికి పైగా సిబ్బందికి డ్రోన్ పైలటింగ్, వైమానిక ప్రతిచర్యల్లో తర్ఫీదు ఇచ్చింది. శత్రు భూభాగంలోకి లోతుగా చొచ్చుకెళ్లి, డ్రోన్లతో లక్ష్యాలను ఛేదించేందుకు సైన్యంలో ఖైరవ్ ఫోర్స్ వంటి అధునాతన హైబ్రిడ్ యుద్ధ విభాగాలను ఏర్పాటు చేశారు. 2030 నాటికి సైనిక విభాలన్నింటిలోనూ పూర్తిస్థాయిలో డ్రోన్లను వినియోగించాలని భారత్ లక్ష్యిస్తోంది.

ప్రపంచంలో డ్రోన్ల తయారీలో చైనా అగ్రగామిగా ఉంది.నిఘా, ఆత్మాహుతి డ్రోన్లతో పాటు ఏఐ ఆధారిత డ్రోన్ల గుంపు తయారీలో డ్రాగన్ ముందుంది. తక్కువ ఖర్చుతో కచ్చితంగా దాడులు చేయగల డ్రోన్లతో తుర్కియే ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. పాకిస్థాన్ ఏమో ఆ రెండు దేశాల నుంచి భారీగా డ్రోన్లను దిగుమతి చేసుకుంటోంది. ఈ ముప్పును తిప్పికొట్టడానికి ఇండియా వడివడిగా అడుగులు వేస్తోంది. మేక్‌ఇన్ ఇండియా, ఐడెక్స్ వంటి పథకాల ద్వారా వందలాది స్టార్టప్‌లతోపాటు అదానీ, టాటా, ఐడియాఫోర్జ్ వంటి పెద్ద కంపెనీలూ డ్రోన్లను తయారు చేస్తున్నాయి. మరోవైపు, డ్రోన్ల కొనుగోలుకు భారత్ భారీగా నిధులను కేటాయించింది.

శత్రు డ్రోన్ల కమ్యూనికేషన్ వ్యవస్థను జామ్ చేయడానికి (సాఫ్ట్‌కిల్) లేజర్ ఆయుధాలు; మైక్రోవేవ్ సాంకేతికతతో డ్రోన్లను గాల్లోనే కూల్చేయడానికి(హార్డ్‌కిల్) అత్యాధునిక రాడార్లు, జామర్లను భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ అభివృద్ధి చేస్తోంది. 2035 నాటికి దేశవ్యాప్తంగా భూతల, అంతరిక్ష ఆధారిత సమగ్ర యాంటీడ్రోన్ రక్షణ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి 'సుదర్శన్ చక్ర' ప్రాజెక్టు పనిచేస్తోంది. ఇజ్రాయెల్ తన ఐరన్ డోమ్, ఐరన్ బీమ్ వంటి లేజర్ ఆధారిత డ్రోన్ రక్షణ సాంకేతికతను భారత్‌తో పంచుకోవడానికి సిద్ధమైంది. అమెరికా సైతం ఇండియాకు డ్రోన్లు, సంబంధిత సాంకేతికతలను అందిస్తోంది. భారత సాయుధ దళాలు ఇజ్రాయెల్‌కు చెందిన 'స్మాష్ 2000 ప్లస్' వంటి అత్యాధునిక రైఫిల్ స్కోప్ వ్యవస్థలను ఉపయోగిస్తున్నాయి. ఇవి వేగంగా వచ్చే చిన్నపాటి శత్రుడ్రోన్లను సైతం కచ్చితంగా గుర్తించి, కూల్చేస్తాయి. 'అదానీఎల్బిట్' వంటి సంస్థలు ఇజ్రాయెల్ సాంకేతికతను ఉపయోగించుకుని డ్రోన్లు, యాంటీడ్రోన్ పరికరాలను తయారు చేస్తున్నాయి.

సొంత తయారీ...

అమెరికా తన నిఘా, డిజిటల్ రక్షణ సాంకేతికతలను భారత్‌కు అందిస్తూ సరిహద్దు భద్రతను పటిష్ఠం చేస్తోంది.హిమాలయ సరిహద్దుల్లో చైనా కదలికలను, పశ్చిమ సరిహద్దుల్లో పాకిస్థాన్ డ్రోన్లను నిరంతరం గమనించడానికి అమెరికా నుంచి ఎంక్యూ 9బీ ప్రిడేటర్ డ్రోన్లను భారత్ సేకరిస్తోంది. అమెరికా వాయుసేన, భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో) కలిసి నింగి నుంచి ప్రయోగించే సరికొత్త డ్రోన్ నమూనాలను అభివృద్ధి చేస్తున్నాయి. ఉపగ్రహ నిఘా సమాచారాన్ని అమెరికా భారత్‌తో పంచుకుంటోంది. దీనివల్ల సరిహద్దు దాటి వచ్చే చైనా, పాకిస్థాన్ డ్రోన్లను ముందే గుర్తించి అడ్డుకోవడం సాధ్యమవుతుంది. భారత్ సైతం సొంతంగా డ్రోన్ల తయారీ, మోహరింపు సామర్థ్యాలను పెంచుకుంటోంది.

6 నెలల్లో 7 సార్లు నాపై హత్యాయత్నం

డ్రామాగా కొట్టిపారేసిన పశ్చిమ బెంగాల్ భాజపా

అమరావతి, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో చర్చనీయాంశం చోటు చేసుకుంది. ఈ రాష్ట్ర మాజీ ఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ అభిషేక్ బెనర్జీ నివాసం వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలు రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపాయి. తన పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలుపుకునేందుకు సిద్ధమవుతున్న వేళ.. బీజేపీకి చెందిన కొందరు సాయుధ కార్యకర్తలు పక్కా పథకం ప్రకారం ఈ దౌర్జన్యానికి దిగారని ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గడిచిన ఆరు నెలల్లోనే తనపై ఏడు సార్లు హత్యాయత్నం జరిగిందనే షాకింగ్ విషయాన్ని కూడా వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..?

కోల్‌కతాలోని ప్రతిష్ఠాత్మక కాళీఘా ప్రాంతంలో ఉన్న తన స్వగృహంపై శనివారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల సమయంలో దుండగులు రాళ్లు, ఇటుకలతో విరుచుకుపడ్డారని అభిషేక్ బెనర్జీ వెల్లడించారు. ఈ దాడి ఘటనలో తమ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గత రెండు రోజులుగా కొందరు అనుమానిత వ్యక్తులు తన నివాస ప్రాంగణం వద్ద రెక్కీ నిర్వహించారని ప్రస్తావించారు. దీనికి సంబంధించిన దృశ్యాలను, తన పేరుతో ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలను దుండగులు గుండాయిజంతో చించివేస్తున్న వీడియో సాక్ష్యాలను ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సదరు అరాచక శక్తుల వద్ద తుపాకులు వంటి భయంకరమైన ఆయుధాలు కూడా ఉన్నాయని, వారిని నిలదీసేందుకు ప్రయత్నించిన సమయంలో తనపై కూడా భౌతిక దాడికి ప్రయత్నించారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ మొత్తం వ్యవహారంలో పశ్చిమ బెంగాల్ పోలీసుల తీరుపై ఎంపీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తన ఇంటి ముందే సాయుధులైన దుండగులు అంతటి తీవ్రమైన హింసకు పాల్పడుతున్నప్పటికీ.. స్థానిక పోలీసులు ఏమాత్రం జోక్యం చేసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. గత ఆరు నెలల కాలంలో తనను లక్ష్యంగా చేసుకుని ఏకంగా ఏడుసార్లు హత్యాయత్నాలు జరిగాయని, దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక అధికారిక పార్లమెంట్ సభ్యుడికే రక్షణ లేని పరిస్థితి ఉంటే, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జీవిస్తున్న సామాన్య ప్రజల భద్రత ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

మరోవైపు టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ చేసిన ఆరోపణలపై భారతీయ జనతా పార్టీ నాయకత్వం తక్షణమే స్పందించింది. అభిషేక్ బెనర్జీ చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా అవాస్తవాలని భాజపా నాయకులు ఖండించారు. రాష్ట్రంలో పాలన సరిగ్గా జరగట్లేదని చెబుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టించడానికే అభిషేక్ బెనర్జీ స్వయంగా ఈ దాడి నాటకాన్ని రచించారన్నారు. అంతేకాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం భాజపాపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రత్యారోపణలు చేశారు. ఈ పరస్పర తీవ్ర ఆరోపణలతో పశ్చిమ బెంగాల్ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.



పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పారదర్శకతకు తావులేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు.

ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ అనే పదాలు కూడా సరిపోవని అన్నారు.ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి, ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్ల ప్రక్రియలోనూ తమకు అనుకూలమైన కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు.

కోదంగల్, నారాయణపేట, మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా



కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును శనివారం సోషల్ మీడియా వేదికగా ఆయన ఎండగట్టారు. సదరు ఎత్తిపోతల పథకానికి రేవంత్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తే.. మంత్రి పొంగులేటికి చెందిన కంపెనీ అందులో పాల్గొందని విమర్శించారు. ఈ టెండర్లలో పాల్గొన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపై ఉన్న నామమాత్రపు సంస్థలని తెలిపారు. చివరకు ఒక్క కంపెనీ మాత్రమే పోటీలో మిగిలి విజయం సాధించేలా వ్యవహారం నడిచిందని మండిపడ్డారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిందని వివరించారు. వ్యయం ఇంత భారీగా పెరగడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ వివరించారు. ఈ ప్రాజెక్టు వ్యయం ఐదు రెట్లు పెరిగిందని సోదాహరణగా చెప్పారు. ప్రజాధనాన్ని ఈ స్థాయిలో ఖర్చు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరు కూడా ప్రజలకు అందలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని ప్రభుత్వంపై అగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లలో పారదర్శకతకు తావు లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు.

ఓ వైపు తెలంగాణలో ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్ల వద్ద క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులపై నిప్పులు చెరిగారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారంటూ ప్రభుత్వంలోని నేతలపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని ఆయనకు స్పష్టం చేశారు. క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ, క్లెప్టోక్రసీ వంటి పదాలు కూడా తెలంగాణలో జరుగుతున్న దోపిడీని వివరించడానికి సరిపోవడం లేదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్ల ప్రక్రియలోనూ తమకు అనుకూలమైన కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుబట్టారు.

పాక్ సందర్శనకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆసక్తి

చండీగఢ్, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తమ దేశంలో పర్యటనకు వీసా జారీపై పాకిస్థాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఒకవేళ ఆయన తమ దేశాన్ని సందర్శించాలనుకుంటే వీసా జారీ విషయాన్ని పరిశీలిస్తామని వెల్లడించింది. శుక్రవారం జరిగిన వీక్లీ మీడియా బ్రీఫింగ్‌లో పాకిస్థాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి సజాద్ హైదర్ ఖాన్.. భగవంత్ మాన్ పర్యటనపై అడిగిన ప్రశ్నకు పై విధంగా స్పందించారు. మాన్ పాకిస్థాన్‌లో పర్యటించాలని కోరుకుంటే ఆయనకు వీసా జారీ చేసే అంశాన్ని పాకిస్థాన్ ప్రభుత్వం 'పరిశీలిస్తుంది' అని ఖాన్ చెప్పారు. అయితే, ఆయన పాక్ వెళ్లేందుకు భారత ప్రభుత్వం అనుమతిస్తుందా లేదా అనేది వేరే విషయమని స్పష్టం చేశారు.

అక్టోబర్ 23న పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మాట్లాడుతూ... నవంబర్ 27న లాహోర్‌లో జరగనున్న ప్రపంచ పంజాబీ సదస్సుకు హాజరు కావాల్సిందిగా తనకు ఆహ్వానం అందిందని తెలిపారు. అయితే, తను పాక్‌కు వెళ్లడానికి అనుమతి లభిస్తుందా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. 'మన సంస్కృతి ఒక్కటే. ఇక్కడి నుంచి చాలా మంది కవులు అక్కడికి వెళతారు' అని ఆయన అన్నారు. ఒకవేళ కర్తార్‌పూర్ కారిడార్ తిరిగి తెరుచుకుంటే పంజాబ్ ఎమ్మెల్యేలందరూ పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్‌ను సందర్శించాలని మాన్ తన కోరికను వ్యక్తం చేశారు.

కర్తాపూర్ కారిడార్

పంజాబ్‌లోని డేరా బాబా నానక్‌ను, పాకిస్థాన్‌లోని చారిత్రాత్మక గురుద్వారా దర్బార్ సాహిబ్‌తో కర్తాపూర్ కారిడార్ కలుపుతుంది. సిక్కు మత స్థాపకుడు గురు నానక్‌దేవ్ తన చివరి రోజుల్లో కర్తాపూర్‌లో గడిపారు. ఇది సిక్కులకు పవిత్ర క్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ పవిత్ర క్షేత్రాన్ని సందర్శించే సిక్కు యాత్రికులకు సౌకర్యార్థం కర్తాపూర్ కారిడార్ ఏర్పాటు చేశారు. ఈ కారిడార్ ద్వారా భారతీయ యాత్రికులు నిబంధనలకు లోబడి, పాకిస్థాన్ వీసా అవసరం లేకుండానే గురుద్వారాను సందర్శించవచ్చు.

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్‌తో పాక్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడి చేసి ధ్వంసం చేసింది. అప్పటి నుంచి భారత వైపు ఈ కారిడార్ గుండా యాత్రికుల రాకపోకలు



నిలిచిపోయాయి. ఈ ఆంక్షలను తొలగిస్తే యాత్రికులకు సదుపాయాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ తెలిపింది. అన్ని మతాల యాత్రికులకు పాకిస్తాన్ స్వాగతం పలుకుతుందని, మతపరమైన స్థలాల సందర్శనకు సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. గతేడాది 9 వేల మంది భారతీయులకు పాక్ వీసాలు 2025లో సిక్కు, హిందూ యాత్రికులతో సహా భారతీయ యాత్రికులకు 9,000లకుపైగా వీసాలను జారీ చేశామని, ఈ ఏడాది ప్రథమార్ధంలో సిక్కు యాత్రికులకు 4,000లకుపైగా అదనపు వీసాలను జారీ చేశామని ఆయన చెప్పారు. ''బాబా గురు నానక్ దేవ్ జీ 557వ జయంతి సందర్భంగా ఈ నెలాఖరులో నాంకానా సాహిబ్ వద్ద పెద్ద సంఖ్యలో సిక్కు యాత్రికులకు స్వాగతం పలికేందుకు పాకిస్థాన్ ఎదురుచూస్తోంది'' అని ఖాన్ అన్నారు.

సిక్కు యాత్రికుల సౌకర్యార్థం పాకిస్థాన్ ప్రత్యేక చొరవతో కర్తార్‌పూర్ కారిడార్‌ను ఏర్పాటు చేసిందని, రోజుకు 5,000 మందికి పైగా యాత్రికులు క్షేత్రాన్ని సందర్శించి అదే రోజు తిరిగి రావడానికి ఇది వీలు కల్పిస్తుందని పాక్ ప్రతినిధి తెలిపారు. ఇరు దేశాల మధ్య మతపరమైన యాత్రలను సులభతరం చేయడానికి 1974లో పాకిస్థాన్‌భారత్ మధ్య జరిగిన 'మతపరమైన క్షేత్రాల సందర్శనల ప్రేమ్‌పర్మ్' ఒక ప్రోటోకాల్‌గా ఉపయోగపడుతుందని ఖాన్ చెప్పారు. తక్షశిల, తఖ్త్ఇబాహిలతో సహా బౌద్ధ వారసత్వ స్థలాల పరిరక్షణకు తాము చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నీటి లభ్యతను బట్టే పంటలు వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ష్ణంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. గతంలో ఈ సమయానికి వందల టీఎంసీల నీరు అందుబాటులో ఉండేదని.. ఇప్పుడు కొన్ని ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు అడుగంటుతున్నాయని పేర్కొన్నారు. కరవు పరిస్థితులపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల నేపథ్యంలో సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం వల్ల కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే ప్రక్రియకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మేడిగడ్డ గేట్లు మూసి 16 టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడే పంప్‌హౌస్‌లోకి నీరు చేరి ఎత్తిపోతలకు అవకాశం ఉంటుందని చెప్పారు. గోదావరిలో నీరు పారుతున్నప్పుడు దాన్ని ఎత్తిపోసేందుకు బ్యారేజీలు ఎందుకు అవసరమనే ప్రశ్నలకు కూడా ఆయన సమాధానమిచ్చారు.

తుపాకులగూడెం వద్ద నీటిని నిల్వ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఖమ్మం ప్రాంతంలో సీతారామ ప్రాజెక్టు ద్వారా ఆ నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారనే విమర్శలను ముఖ్యమంత్రి తీవ్రంగా ఖండించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి కూడా వివరణ ఇచ్చారు. ఈ 3 బ్యారేజీలు పనిచేసినప్పుడే శ్రీపాద ఎల్లంపల్లికి నీరు చేరుతుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో ఏర్పడే కరవు పరిస్థితులు, కాళేశ్వరం ప్రాజెక్టు, గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై డిసెంబర్‌లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2, 3 రోజుల పాటు సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలపై సమగ్రంగా చర్చిస్తామని చెప్పారు. ప్రాజెక్టుల పరిస్థితి, నీటి లభ్యత, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాంతంలో దశాబ్దాలుగా తాగునీరు, సాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో మార్పు వస్తుందని ఆశించినా అనేక సాగునీటి ప్రాజెక్టులు పూర్తికాలేదని విమర్శించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరురంగారెడ్డి, మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకాల పనులపై గత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఎస్ఎల్‌బీసీ పూర్తయి ఉంటే నల్గొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి తోడ్పడేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అచ్చంపేట ఎత్తిపోతల, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులు కూడా పూర్తికాలేదని అన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి చేవెళ్ల, వికారాబాద్, తాండూరు వరకు నీటిని తరలించాలని ప్రణాళిక రూపొందించారని, అప్పట్లో రూ.15 వేల కోట్లు ఖర్చు చేశారని గుర్తుచేశారు.

కొడంగల్ ప్రాంతంలో మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారని.. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించి భూసేకరణ చేపట్టామని చెప్పారు. హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని.. ఢిల్లీనోయిడా, ముంబైపుణె తరహాలో ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కొడంగల్ వరకు 250 అడుగుల రహదారి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



పరిషత్ ఫలితాల్లో కూటమి హవా

అమరావతి, నవంబర్ 07, అనంత జనశక్తి న్యూస్

స్థానిక ఎన్నికల్లో కూటమి జోరు కొనసాగుతోంది. తాజాగా వెల్లడైన పరిషత్ ఎన్నికల్లోనూ మెజార్టీ స్థానాల్లో పాగా వేసింది. దీంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులు ఆనందంలో ఉన్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల పరిధిలో ఖాళీగా ఉన్న 582 జెడ్పీటీసీ, 7,767 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 5వ తేదీన అధికారులు పోలింగ్ నిర్వహించారు. అంతకుముందే 77 జడ్పీటీసీ స్థానాలు, 2,051 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం... టీడీపీ నేతృత్వంలోని కూటమి జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక ఆధిక్యంలో దూసుకుపోతోంది. ఏకగ్రీవమైన 77 స్థానాలతో కలిపి కూటమి అభ్యర్థులు ఇప్పటికే 320కి పైగా జడ్పీటీసీ స్థానాలను తమ ఖాతాలో వేసుకున్నారు. మరో 100కి పైగా జెడ్పీటీసీ స్థానాల్లో స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతున్నారు. 7,767 ఎంపీటీసీ స్థానాల లెక్కింపులో కూడా ఇదే తరహా ఫలితాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రతిపక్ష వైసీపీ 27 జెడ్పీటీసీ స్థానాల్లో గెలవగా... 709 ఎంపీటీసీ స్థానాల్లో విక్టరీ కొట్టింది.

వైసీపీ గడపలో కూటమి జెండా...

ఇప్పటివరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని ప్రాబల్యం ఉన్న కడప జిల్లాలో టీడీపీ భారీ ఆధిక్యాన్ని చూపించింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు తిరుగులేని మెజార్టీ దిశగా పయనిస్తున్నారు. ఇటీవలే జరిగిన పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికల్లో సంచలన విజయం నమోదు చేసిన తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంది. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గమైన కుప్పం జడ్పీటీసీ స్థానంతో పాటు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని అత్యధిక జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు స్పష్టమైన విజయాన్ని అందుకున్నారు.

మరోవైపు ఫలితాల వెల్లడిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేశారు. "కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు ఇది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై ఓటర్లు ఉంచిన నమ్మకానికి ఈ ఫలితాలే నిదర్శనం," అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనేక అక్రమాలు జరిగాయని, తమ ఫిర్యాదులపై రాష్ట్ర ఎన్నికల సంఘం సమయానికి స్పందించలేదని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

పరిషత్ పోరులో పలువురు అభ్యర్థులు అత్యధిక మెజార్టీలతో ఘన విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట లక్ష్మీసరోజ 32,919 ఓట్ల మెజార్టీతో సీపీఎం అభ్యర్థిపై రికార్డు స్థాయిలో విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో ఇదే అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు జనసేన జడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగిన పమిడిపాటి శ్రీనివాసరావు 30,273 ఓట్ల మెజార్టీతో సత్తాచాటారు. క్రోసూరు మండలంలో మొత్తం 38వేల ఓట్లు పోలవ్వగా సమీప ప్రత్యర్థిపై రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో జనసేన శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలో కూటమి బలపరిచిన జనసేన జడ్పీటీసీ అభ్యర్థి శింగంశెట్టి వెంకట బాల ప్రసాద్ 28,863 మెజారిటీతో గెలుపు పల్నాడు జిల్లా మాచవరం మండలం కూటమి బలపరిచిన తెదేపా అభ్యర్థి కత్తి సరోజిని 22,882 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి దొండేటి వెంకాయమ్మపై విజయం సాధించారు.

నంద్యాల జిల్లా డోన్ మండలం తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి రేగటి లక్ష్మీవేదవతి.. సమీప ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి రాజేశ్వరిపై 23,169 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి పుత్త బ్రహ్మం 21,407 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

కడప జిల్లా వేంపల్లిలో వైకాపా జడ్పీటీసీ అభ్యర్థి బత్తల వెంకట శివమ్మ 19,203 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

ప్రకాశం జిల్లా ముండ్లమూరు జడ్పీటీసీ స్థానం నుంచి తెదేపా తరఫున పోటీ చేసిన మందలపు సౌమ్య 18,728 ఓట్ల అధిక్యంతో గెలుపొందారు.

పల్నాడు జిల్లా గురజాల మండల తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి మద్దినేని లక్ష్మి సమీప ప్రత్యర్థిపై 17 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.

ప్రకాశం జిల్లా గిద్దలూరు మండల తెదేపా జడ్పీటీసీ అభ్యర్థి చేరెడ్డి శ్రీలక్ష్మి 12,616 ఓట్ల మెజార్టీతో ఘన విజయం అందుకున్నారు.

కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం తెలుగుదేశం జడ్పీటీసీ అభ్యర్థి నాగిపోగు పుల్లయ్య 17,295 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి ఉన్నం దీపిక 20,167 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ప్రకాశం జిల్లా దొనకొండ జడ్పీటీసీ స్థానం నుంచి తెదేపా అభ్యర్థి మోడీ ఈశ్వరమ్మ 15,785 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు.

ఏపీ పరిషత్ ఎన్నికల్లో కొంతమంది అభ్యర్థులు సెన్సేషన్ క్రియేట్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో రికార్డ్ సృష్టించారు. ప్రత్యర్థులపై వేరే లెవల్లో పై చేయి సాధించారు. పల్నాడు జిల్లా క్రోసూరులో జనసేన అభ్యర్థి పమిడిపాటి శ్రీనివాసరావు ఏకంగా 30వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం జరిగింది. ఇక్కడ మొత్తం 50 వేల 661 ఓట్లకు.. 38 వేల 7 వందల 02 ఓట్లు పోలయ్యాయి. ఇక నకరికల్లు టీడీపీ జడ్పీటీసీగా డాక్టర్ నాగోతు వెంకటలక్ష్మీ సరోజ 32 వేల 9 వందల 19 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో టీడీపీ శ్రేణులు విజయ సంబరాలు చేసుకుంటున్నాయి.

మాచవరం మండలంలో కూటమి అభ్యర్థి భారీ విజయం..

అంతేకాదు పల్నాడు జిల్లాలోని మాచవరం మండలంలోనూ కూటమి అభ్యర్థి కూడా భారీ విజయం పొందారు. తెలుగు దేశం తరఫున పోటీ చేసిన కత్తి సరోజిని 22 వేల 8 వందల 82 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తన సమీప వైసీపీ అభ్యర్థి దొండేటి వెంకాయమ్మపై ఆమె గెలవడం జరిగింది. మరోవైపు ప్రకాశం జిల్లా ముండ్లమూరు జడ్పీటీసీగా టీడీపీ తరుఫున పోటీ చేసిన అభ్యర్థి మందలపు సౌమ్య 18 వేల 728 ఓట్ల ఆధిక్యంతో విన్ అయ్యారు.

ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో...

వీరితో పాటు ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో టీడీపీ అభ్యర్థి పుత్త బ్రహ్మం 21 వేల 4 వందల ఏడు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించగా.. మరోవైపు కడప జిల్లా వేంపల్లిలో వైసీపీ అభ్యర్థి బత్తల వెంకట శివమ్మ 19 వేల 2 వందల 03 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అదేవిధంగా ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలంలో టీడీపీ అభ్యర్థి చేరెడ్డి శ్రీలక్ష్మి 12 వేల 6 వందల 16 ఓట్ల మెజార్టీతో విజయ దుందుబీ మోగించారు. అలాగే కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలో తండ్రీ, కుమార్తెలు ఎంపీటీసీలు గ



ఒప్పిచర్లలో ఉచిత ఆయుష్ వైద్య శిబిరం

ఆరోగ్యంపై అవగాహనతో పాటు ఉచితంగా ఆయుర్వేద మందుల పంపిణీ

పల్నాడు నవంబర్ 07,అనంత జనశక్తి న్యూస్

పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామంలో బ్రిక్స్ వారోత్సవాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన సదస్సుతో పాటు ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు డాక్టర్ రమ్య, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, విద్యుత్ శక్తిని ఆదా చేయడం, నీటి పొదుపు, చిరుధాన్యాల ప్రాధాన్యత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.సీజనల్ వ్యాధులు, నీరసం బారిన పడకుండా తగినంత నీరు తాగాలని, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు, రాగి జావ వంటి పౌష్టిక పానీయాలను తీసుకోవాలని వివరించారు. నీటిలో నిమ్మరసం, చిటికెడు ఉప్పు, కొద్దిగా కండ చక్కెర కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ద్రవాలు అందుతాయని తెలిపారు.అనంతరం గ్రామస్తులకు ఉచితంగా ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. యోగా ఉపాధ్యాయుడు జి. నరసింహారావు యోగా ప్రాముఖ్యతను వివరించి, పలువురితో యోగాసనాలు చేయించారు.ఈ కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ లాలు నాయక్, శివాలయం చైర్మన్ కాకర్ల సాంబయ్య, గ్రామ పెద్దలు కొండవీటి అప్పారావు, శ్రీను, కె. సుబ్బారావు, వెంపటి లక్ష్మమ్మ, ఆలయ పూజారి రాజ్ కుమార్, ఆశా కార్యకర్త సరోజినమ్మ, కాంపౌండర్ ఎస్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఎంపీటీసీ విజయాలు..
మంత్రి పయ్యావులకు కృతజ్ఞతలు



ఉరవకొండలో మంత్రి పయ్యావులను కలిసిన టీడీపీ విజేతలు

ఉరవకొండ నవంబర్ 07 అనంత జనశక్తి న్యూస్

ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి విజయ ధ్రువీకరణ పత్రాలు అందుకున్న అనంతరం ఉరవకొండలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం పార్టీ కార్యాలయానికి చేరుకుని మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఎంపీటీసీ ఎన్నికల్లో సాధించిన విజయాలు పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషికి నిదర్శనమని అన్నారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ విజయాలు ప్రతిబింబమని పేర్కొన్నారు. విజయం సాధించిన అభ్యర్థులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తమ తమ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

మంత్రి కందుల దుర్గేష్ సౌజన్యంతో వరద బాధితులకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా

నిడదవోలు నవంబర్ 07 అనంత జనశక్తి న్యూస్

మురసు తుఫాన్ ధాటికి నిడదవోలు పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రి దుర్గేష్ సౌజన్యంతో 'బాలవికాస' సంస్థ ఆధ్వర్యంలో, 'అమేజాన్' సంస్థ సహకారంతో అత్యాధునిక "మొబైల్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్" వాహనాన్ని రప్పించి తీరుగూడెం, ఇందిరానగర్ ప్రాంతాల్లోని బాధిత ప్రజలకు సురక్షితమైన తాగునీటిని పంపిణీ చేశారు. ఈ వాహనాల ద్వారా నేరుగా ప్రజలు ఉన్న ప్రాంతాలకే వెళ్లి Ultrafiltration (UF), Reverse Osmosis (RO), UV Filtration వంటి మూడు రకాల ఆధునిక నీటి శుద్ధీకరణ పద్ధతులు వినియోగించి శుద్ధి చేసిన మంచి నీటిని పంపిణీ చేస్తున్నారు. రవాణా సౌకర్యం లేని, నీరు నిలిచిపోయిన ప్రాంతాలకు డ్రోన్ సాంకేతికత ద్వారా మంచినీటి క్యాన్లను నేరుగా డెలివరీ చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... వరదలు,తుఫాన్ లాంటి విపత్కర సమయంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే సురక్షితమైన తాగునీరు అత్యంత అవసరమని, ప్రభావిత ప్రాంతాల్లోని చివరి ఇల్లు వరకు స్వచ్ఛమైన నీరు చేరే వరకు ఈ పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. నిడదవోలు ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటామని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు.ఆపత్కాల సమయంలో అండగా నిలిచిన ఆయా సంస్థలకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు.



యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి

- నాగార్జునసాగర్ పట్టణ ఎస్ఐ సతీష్
- ఘనంగా ప్రారంభమైన సాగర్ ప్రీమియర్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్
- బ్యాట్ పట్టి టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎస్ఐ

నాగార్జునసాగర్,నవంబర్ 7
అనంత జనశక్తి న్యూస్



యువత క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకుని, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని నాగార్జునసాగర్ పట్టణ ఎస్ఐ సతీష్ పిలుపునిచ్చారు, నాగార్జునసాగర్ పట్టణంలోని పైలాన్ కాలనీ పోలీస్ గ్రౌండ్ ప్రాంగణంలో శనివారం నాగార్జునసాగర్ ప్రీమియర్ సీజన్ 1 క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలను నిర్వహించారు,ఈ వేడుకలకు విజయపురి పట్టణ ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, ముందుగా క్రీడా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన రిబ్బన్‌ను ఎస్సై సతీష్ కట్ చేసి టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.మైదానంలో టాస్ ఎగరవేసి,స్వయంగా బ్యాట్‌తో బంతిని కొట్టి క్రీడాకారులలో జోష్ నింపారు. మొదటి రోజు మ్యాచ్‌లను ప్రారంభించి ఇరు జట్ల ఆటగాళ్లను,అభినందించారు ఈ సందర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడు తూ నేటి యువత చదువుతో పాటు క్రీడా పోటీలలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషకరమని,ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రమశిక్షణను సహభావాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు, నిర్వాహకులు మైలపల్లి శ్రీను ఈ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు,నిర్వాహకులు మైలపల్లి శ్రీను మాట్లాడుతూ.ఈ క్రీడా పోటీలు ఏడు రోజులపాటు కొనసాగుతాయని వెల్లడించారు ఈ టోర్నమెంట్‌కు సంబంధించి మొత్తం 6 జట్లు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నాయి.మొదటి బహుమతి 50,000 స్పాన్సర్ మైలపల్లి అమ్మోరయ్య,రెండో బహుమతి 30,000 స్పాన్సర్ రాజు అందించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా టోర్నమెంట్ నిర్వాహకులు ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ ఎస్సై సతీష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు,
ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షులు రమణ,ఓబీసీ నాయకులు జంగన్న, 7వ వార్డు కౌన్సిలర్ మైలపల్లి జానకి వెంకటేష్, కోఆప్షన్ సభ్యులు ఎండీ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తగ్గింపుతోనే పర్యావరణ పరిరక్షణ

- ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిక్స్ సస్టెనబుల్ లైఫ్‌స్టైల్ వీక్ ఏడో రోజు అవగాహన కార్యక్రమం

ఉరవకొండ నవంబర్ 07 అనంత జనశక్తి న్యూస్



పర్యావరణ పరిరక్షణకు వ్యర్థాల తగ్గింపు, వాటి సమర్థవంతమైన నిర్వహణ ఎంతో కీలకమని ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), అనంతపురం వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ ఇ. శ్రీదేవి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండలో బ్రిక్స్ (BRICS)2026 సస్టెనబుల్ లైఫ్‌స్టైల్ వీక్‌లో భాగంగా ఏడో రోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శైలజారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, తడి-పొడి చెత్తను వేరు చేయడం, వ్యర్థాలను పునర్వినియోగించడం, రీసైక్లింగ్ పద్ధతులను పాటించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శైలజారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, విద్యార్థులు తమ రోజువారీ జీవితంలో పర్యావరణహిత అలవాట్లను అలవర్చుకోవడంతో పాటు సమాజంలో ఇతరులకు కూడా ఆదర్శంగా నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బ్రిక్స్ సమన్వయకర్త పి. సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎం. విష్ణుప్రియ, ఎం. సుధాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.వ్యర్థాలను తగ్గిద్దాం..పర్యావరణాన్ని కాపాడుదాం..భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దాం అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ నిఘా.. భద్రతపై ఎస్పీ దృష్టి!

- ధర్మవరంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కేంద్రాల తనిఖీ.....
- ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట బందోబస్తు....
- ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు...

ధర్మవరం నవంబర్ 7 అనంత జనశక్తి న్యూస్ :



ధర్మవరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది.ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ధర్మవరం పట్టణంలోని కౌంటింగ్ కేంద్రాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్మవరం బాలికల జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, భద్రతా చర్యలు, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన నిఘా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసులు అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు వచ్చే అధికారులు, సిబ్బంది, అనుమతి పొందిన వ్యక్తుల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కేంద్రాల పరిసరాల్లో నిరంతరం పోలీస్ నిఘా కొనసాగించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా కౌంటింగ్ సమయంలో ప్రజలు, రాజకీయ పార్టీల కార్యకర్తలు సంయమనం పాటించేలా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.
కౌంటింగ్ విధుల్లో పాల్గొంటున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి భద్రతా నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. విధుల కేటాయింపుల్లో అప్రమత్తత, సమన్వయం, క్రమశిక్షణ పాటిస్తూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ జగన్నాథ్ రాజు, సీఐలు రెడ్డప్ప, జయ నాయక్, బొజ్జప్ప తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం కౌంటింగ్ కేంద్రం వద్ద గోరంట్ల మాధవ్ నిరసన

- గెలుపు తమదేనంటూ వైఎస్ఆర్సీపీ అభ్యర్థి వాదన
- టీడీపీ అభ్యర్థి విజయం ప్రకటించడంపై అభ్యంతరం
- రీ-కౌంటింగ్ నిర్వహించాలని డిమాండ్

ధర్మవరం నవంబర్ 7 అనంత జనశక్తి న్యూస్ :



ధర్మవరం ఎన్నికల ఫలితాల ప్రకటన నేపథ్యంలో ధర్మవరంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. చెన్నేకొత్తపల్లి మండలం ఎంపీటీసీ 1 స్థానం ఫలితంపై వివాదం తలెత్తడంతో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కౌంటింగ్ కేంద్రం వద్ద నిరసనకు దిగారు. వైఎస్ఆర్సీపీ అభ్యర్థి ఎసీడీ శ్రీనివాస్ రెడ్డి విజయం సాధించినప్పటికీ, టీడీపీ అభ్యర్థి గెలిచినట్లు అధికారులు ప్రకటించారనేది వైఎస్ఆర్సీపీ శ్రేణుల ప్రధాన ఆరోపణ. ఓట్ల లెక్కింపులో తమకు అన్యాయం జరిగిందని, ఫలితాలపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ రీకౌంటింగ్ నిర్వహించాలని అభ్యర్థి అధికారులను కోరినప్పటికీ స్పందన రాలేదని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు.
ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రీకౌంటింగ్ నిర్వహించి వాస్తవ ఫలితాలను ప్రకటించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన అభ్యర్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రీకౌంటింగ్ కోరిన అభ్యర్థిని పోలీసులు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపించారంటూ వైఎస్ఆర్సీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఓట్ల లెక్కింపుపై అభ్యర్థికి ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొన్నారు.
గెలిచిన అభ్యర్థిని ఓడినట్లు ప్రకటించారా? ఓడిన అభ్యర్థిని విజేతగా ప్రకటించారా? అంటూ వైఎస్ఆర్సీపీ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే ప్రతి ఓటుకు తగిన న్యాయం జరగాలని, ఫలితాలపై అభ్యంతరాలు వ్యక్తమైనప్పుడు నిబంధనల ప్రకారం పరిశీలన జరగాలని వారు కోరారు. ఈ వివాదంపై అధికారులు స్పష్టతనివ్వాలని, రీకౌంటింగ్ అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించాలని డిమాండ్ చేస్తూ గోరంట్ల మాధవ్, వైఎస్ఆర్సీపీ శ్రేణులు తమ నిరసనను కొనసాగించారు. న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

కనిపించిన జేసి హవా...

- టీడీపీ ఎనిమిది స్థానాలు గెలుపు...
- రెండు స్థానాల్లో వైసిపీ గెలుపు...

యల్లనూరు, నవంబరు 7, అనంత జనశక్తి న్యూస్:

యల్లనూరు మండలంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో టిడిపి తన విజయాన్ని దంకాను మోగించింది. తాడపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చొరవతో మండలంలో పార్టీ గెలుపు సునాయాసం అయ్యిందని మండల టీడీపీ నేతలు అన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం పది ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఇందులో తిమ్మంపల్లి ఎంపీటీసీ స్థానం ఏకగ్రీవమైంది. మిగిలిన తొమ్మిది స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో రెండు ఎంపీటీసీ స్థానాలను వైసీపీకి మిగిలిన ఏడు ఎంపీటీసీ స్థానాలు టిడిపి కి అన్న రీతిలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీలు తిమ్మంపల్లి ఎంపీటీసీ స్థానం లక్ష్మీదేవి ఏకగ్రీవం అవగా యల్లనూరు1 దొడ్లో లత 907మెజారిటితోనూ , యల్లనూరు2 దొడ్లో సుబ్బరాయుడు 1468 మెజారిటితోనూ,
పెద్ద మల్లేపల్లి కి చెందిన ఎంపీటీసీ స్థానంలో నరేంద్ర 1870 మెజారిటితోనూ,
బొప్పేపల్లి ఎంపీటీసీ స్థానంలో భారతి 14 44 మెజార్టీతోను. వెన్నపూస పల్లి ఎంపీటీసీ స్థానం ప్రసాద్ రెడ్డి 1846 మెజార్టీతోను. కల్లూరు లింగారెడ్డి 2227 మెజార్టీతోను.
మల్లగుండ్ల కేశప్ప 1325 మెజార్టీతోను.
వైసీపీకి కేటాయించిన చిలమకూరు ఎంపీటీసీ స్థానానికి శివ రత్నమ్మ 812 మెజారిటితోను, గొడ్డుమర్రి ఎంపీటీసీ స్థానానికి చెందిన ప్రమీల 1863 మెజారిటి తో విజయం సాధించారు.







స్నానం చేసే నీటిలో కొద్దిగా ఇప్పుడు చెప్పే పదార్థాన్ని కలపండి, బాడీ పెయిన్స్ తగ్గడమే కాదు ఎన్నో సమస్యలు దూరం

ప్రజెంట్ సిట్యువేషన్ ఎలా ఉందంటే ప్రతీ ఒక్కరూ కూడా లైఫ్‌లో స్ట్రెస్‌గా ఫీల్ అవుతున్నారు. దీంతో ఊరికే అలసిపోవడం, బాడీ పెయిన్స్ వంటివి కామన్ అయిపోయాయి. దీంతో ప్రతీ చిన్న విషయానికే నొప్పి మందులు తీసుకుంటున్నారు. కానీ, అలా కాకుండా కొన్ని సహజ పద్ధతులని ఫాలో అయితే మెడిసిన్ వాడకుండానే నొప్పులని తగ్గించుకోగలగుతారు. అంటా సహజ పద్ధతుల్లో ఉప్ప నీటి స్నానం ఒకటి. సముద్రపు ఉప్ప నీటిని స్నానం చేసే నీటిలో కలిపి ఆ నీటితో స్నానం చేసి చూడండి. వచ్చే లాభాలు అన్నీ ఇన్నీ కావు.



సముద్రపు ఉప్ప అంటే

సముద్రపు ఉప్ప అంటే సముద్రంలోని నీటిని ఎండబెట్టి ఈ ఉప్పుని తయారుచేస్తారు. ఇందులో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, జింక్ వంటి ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి మన చర్మం, కండరాలు, కీళ్ళకి చాలా మంచివి. ఈ నీటితో స్నానం చేస్తే ఎన్నో ఎన్నెన్నో లాభాలు కూడా ఉన్నాయి.

చర్మానికి మేలు

సముద్రపు నీటితో స్నానం చేయడం వల్ల చర్మానికి మేలు జరుగుతుంది. ఇది చనిపోయిన చర్మ కణాలని తొలగించి కొత్త కణాలు ఏర్పడేలా చేస్తాయి. చర్మాన్ని హైడ్రేట్‌గా, మృదువుగా ఉండేలా చేస్తాయి. స్కిన్ ప్రాబ్లమ్స్‌తో బాధపడేవారు ఈ నీటితో స్నానం చేస్తే చాలా మంచిది. ఎలాంటి మెడిసిన్ వాడకుండానే స్కిన్ చక్కగా మెరుస్తుంది.



బాడీ పెయిన్స్

రోజంతా పనిచేయడం, ముఖ్యంగా కూర్చొని చేసే పనిలో 8 నుండి 9 గంటల పనిచేయడం వల్ల శరీర దృఢత్వం, కండరాల నొప్పులు పెరుగుతాయి. నొప్పి నివారణ మందులకి బదులుగా, ఉప్ప నీటితో స్నానం చేయడం వల్ల ఈ నొప్పులు తగ్గుతాయి. దీని వల్ల రక్తప్రసరణ పెరుగుతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి.ముఖ్యంగా, అలసిన పాదాలకి ఉపశమనం లభిస్తుంది.



ఒత్తిడి తగ్గేందుకు

ఉప్ప నీటితో స్నానం చేయడం వల్ల బాడీ మాత్రమే కాదు, మనసు కూడా రిలాక్స్ అవుతుంది. గోరువెచ్చని ఉప్ప నీటితో స్నానం చేస్తే ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర వస్తుంది. పడుకునే ముందు, ఇలా నీటిలో ఉప్ప కలిపి స్నానం చేస్తే మంచి రిలాక్స్‌గా ఉంటుంది.

ఎలా చేయాలి?

ఓ టబ్‌లో వేడి నీరు నింపండి.

అందులో పావు కప్పు నుండి 2 కప్పుల వరకూ సముద్రపు ఉప్ప వేయండి.

నీరు గోరువెచ్చగా అయ్యేవరకూ అలానే ఉంచితే ఉప్ప కరుగుతుంది. తర్వాత 15 నుంచి 20 నిమిషాలు నీటిలో కూర్చోండి.

ఆ పీలు లేకపోతే మెల్లిగా నీరు పోసుకుంటూ ఎక్కువసేపు స్నానం చేయండి. తర్వాత మాయిశ్చరైజర్ రాయండి.

రెగ్యులర్‌గా ఇలా చేసి చూడండి. మంచి రిజల్ట్స్ ఉంటాయి. మీ స్కిన్‌పై ఏవైనా గాయాలు, ఇన్ఫెక్షన్స్, అలర్జీలు ఉంటే ఉప్ప నీటితో స్నానం చేయొద్దు. ఇలా వారానికి 2 నుండి 3 సార్లు చేస్తే చాలు.

పాదాల పగుళ్ళు పగులుతున్నాయా, ఇప్పుడు చెప్పేవి రాస్తే 7 రోజుల్లోనే కోమలంగా మారతాయి



పాదాల పగుళ్ళు ఉంటే చాలా సమస్యగా ఉంటుంది. నడవలేరు. ముఖ్యంగా చెప్పులు లేక నడిస్తే మరీ ఇబ్బందిగా ఉంటుంది. సమస్య రాగానే మట్టిలో నడిచినా, బట్టలు పిండినా కూడా సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి, దీనిని తగ్గించుకోవాలి. ఆయుర్వేదంలో ప్రతీ సమస్యకి పరిష్కారం ఉన్నట్లుగానే కాలి పగుళ్ళకి కూడా మంచి చిట్కాలు ఉన్నాయి. కొన్ని నూనెలతో ఆయుర్వేద పద్ధతిలో మసాజ్ చేస్తే గనుక 7 రోజుల్లోనే కాలి పగుళ్ళు తగ్గి పాదాలు సాఫ్ట్‌గా మాతాయి. కోమలంగా అనిపిస్తాయి. బయట కొనే క్రీమ్స్ కంటే ఎన్నో రెట్లు ఇవి ఎఫెక్టివ్‌గా పనిచేసి కాలి పగుళ్ళని తగ్గిస్తాయి. పైగా వీటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. నేచురల్‌గానే బేబి సాఫ్ట్ పాదాలు మీ సొంతమవుతాయి. ఇంట్లో వాడే కొన్ని నూనెల్ని వాడి పాదాల పగుళ్ళని చాలా వరకూ తగ్గించుకోవచ్చు శ్వేతా షా ప్రకారం, వీటిని ఎలా వాడాలో తెలుసుకోండి.



కావాల్సిన పదార్థాలు

కావాల్సిన పదార్థాలు

నువ్వుల నూనె 90 మి.లీ

వేప నూనె 30 మి.లీ

అలోవెరా జెల్ 1 టీస్పూన్

పసుపు 1 టీస్పూన్

చందనం పొడి 1 టీస్పూన్

వేప పొడి 1 టీస్పూన్

ఏం చేయాలి?

పైన చెప్పిన పదార్థాలన్నీ ఓ గిన్నెలో కలపాలి.

దీనిని డబుల్ బాయిల్ మెథడ్‌లో ఓ సారి వేడి చేయండి.

పడుకునే ముందు కాళ్ళని శుభ్రంగా కడుక్కోవాలి.

తర్వాత తయారుచేసి పెట్టుకున్న మిశ్రమాన్ని రాసి చక్కగా మసాజ్ చేయాలి.

తర్వాత కాటన్ సాక్స్‌లు వేసుకుని రాత్రంతా అలానే ఉంచాలి.

ఇలా రెగ్యులర్‌గా చేస్తే చాలా వరకూ కాలి పగుళ్ళు తగ్గుతాయి.

లాభాలు

వీటిలోని గుణాలు పాదాలని లోతుగా మాయిశ్చరైజ్ చేసి కోమలంగా మారుస్తాయి.



ఇందులోని యాంటీ మైక్రోబయల్ ప్రోటెక్షన్ స్కిన్‌ని త్వరగా రిపేర్ చేస్తుంది.

దీనిని రెగ్యులర్‌గా వాడడం వల్ల మృదువైన పగుళ్ళు లేని పాదాలు మీ సొంతమవుతాయి. ఇందులో వాడిన నువ్వులనూనె, వేపపొడి, అలోవెరా జెల్ వంటివన్నీ కూడా చర్మ సమస్యల్ని దూరం చేస్తాయి. దీంతో కాలి పగుళ్ళని తగ్గించి పాదాలని సాఫ్ట్‌గా మారుస్తాయి.

తులసితో కూడా

కాలి పగుళ్ళు తగ్గేందుకు తులసిని కూడా వాడొచ్చు. దీనికోసం

తులసి పేస్ట్

అలోవెరా జెల్

కర్పూరం

వీటన్నింటిని బాగా కలిపి పాదాలకి మసాజ్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే మీ పాదాల పగుళ్ళు చాలా వరకూ తగ్గుతాయి.

పాదాలు పగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దీనికోసం రెగ్యులర్‌గా పాదాలను 15 నిమిషాల పాటు గోరువెచ్చని నీటిలో నానబెట్టండి.

తర్వాత వాటిని ప్యూమిస్ రాయితో స్క్రబ్ చేయండి. దీంతో డెడ్ స్కిన్ సెల్స్ దూరమవుతాయి.

తర్వాత హార్స్, సువాసనలు ఉండే క్రీమ్స్ సోప్స్ బదులు కొబ్బరినూనె, ఆలివ్ ఆయిల్, బాదం ఆయిల్ రాయండి.

రాత్రుళ్ళు రాసి మసాజ్ చేసి సాక్స్ వేసుకోండి. ఇలా చేస్తుంటే పాదాలు చాలా వరకూ సాఫ్ట్‌గా మారతాయి.

‘రామాయణ’ అంటే వీ ఎఫ్ఎక్స్ మాత్రమే కాదు

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం ‘రామాయణ’పై బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమా బడ్జెట్, వీఎఫ్ఎక్స్ గురించి కాకుండా రామాయణంలోని పాత్రలు, వాటి గొప్పతనం గురించి చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కించిన ‘రామాయణ’ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా రూపొందించేందుకు సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో సినిమా కథ కంటే బడ్జెట్, విజువల్ ఎఫెక్ట్స్‌పైనే ఎక్కువగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తన తాజా చిత్రం ‘మాతృభూమి’ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్ ఖాన్.. ‘రామాయణ’ సినిమా గురించి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. “రామాయణ’ గురించి చర్చ జరగాలంటే అది రామాయణం కథ గురించి మాత్రమే అయి ఉండాలి. సినిమాలో ఉపయోగించిన వీఎఫ్ఎక్స్, నిర్మాణ వ్యయం గురించి కాదు..! రూ.4 వేల కోట్ల బడ్జెట్ అంటూ పదేపదే మాట్లాడటం సరైన పద్ధతి కాదని నేను భావిస్తున్నాను. సినిమా గురించి మాట్లాడేటప్పుడు రాముడు, రావణుడు, సీతాదేవి గురించి మాట్లాడాలి. మన పురాణ గ్రంథాల్లో ఉన్న విషయాలు, ఆ పాత్రల గొప్పతనం గురించి చర్చించాలి. రాముడి వ్యక్తిత్వం, ఆయనలోని సుగుణాలను ప్రజలకు తెలియజేయాలి. శ్రీరాముడు ఎంతో గొప్పవాడు. ఉత్తమ భర్త, కుమారుడు, సోదరుడు. గొప్ప యోధుడు. నేను నటించిన ‘మాతృభూమి’ సినిమాలోని నా పాత్రలోనూ ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి’ అని సల్మాన్ ఖాన్ వివరించారు.



ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్

టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. “ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను” అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ‘భద్ర’, ‘బొమ్మరిల్లు’, ‘ఏమాయ చేశావే’, ‘నాయక్’, ‘బాద్ షా’ వంటి సినిమాలతో మెప్పించారు.



అందుకే తెలుగులోకి ధైర్యంగా అడుగుపెట్టా!



చిరంజీవితో కలిసి ప్రయాణం చేస్తుండడం ఓ గొప్ప అనుభవం. ఆయన సెట్‌లో ఎంతో ప్రొఫెషనల్‌గా ఉంటారు. నటన పరంగానే కాదు, వ్యక్తిగా ఆయన్నుంచి చాలా నేర్చుకోవచ్చు. ఆయనతో కలిసి నటిస్తున్నందుకు గర్వపడుతున్నా. రవితేజ చిత్రం ‘తులాభారం’లో నేను కథానాయికని కాదు, అందులో నాది ఓ కీలక పాత్ర. సంగీత్ శోభన్‌తో కలిసి ‘అంతా రాములోరు చూస్కుంటారు’ చిత్రంలో నటిస్తున్నా. తెలుగు రాష్ట్రాలు చేసుకున్నంత ఘనంగా కేరళంలో దీపావళి వేడుకలు జరగవు. అక్కడ ఇంత పెద్ద పండుగ కాదు. ఈసారైతే హైదరాబాద్‌లోనే ‘ఇట్లు అర్జున’ బృందంతో కలిసి దీపావళి చేసుకొనేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా. తెలుగులో నేను ఒప్పుకున్న మొట్ట మొదటి సినిమా ఇదే. ఆ తర్వాతే ‘ఛాంపియన్’కి పచ్చజెండా ఊపా. కానీ ‘ఇట్లు అర్జున’ సినిమానే ఆలస్యంగా ప్రేక్షకుల ముందుకొస్తోంది. విడుదల ఆలస్యమైనా సరే, ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నామనే తృప్తి ఉంది. యాక్షన్ కోణం ఉన్నప్పటికీ... ప్రేమకథే ఈ సినిమాకి కీలకం. నేను కీర్తి అనే యువతిగా కనిపిస్తా. ప్రతి అమ్మాయి కనెక్ట్ అయ్యేలా ఈ పాత్ర ఉంటుంది. దర్శకుడు మహేశ్ కథ చెబుతున్నప్పుడే ఆ పాత్రతో నాకు అనుబంధం ఏర్పడింది. ఓ యువతిగా నన్ను నేను ఆ పాత్రలో చూసుకున్నా. అమాయకత్వం, ఉత్సాహం కలగలిసిన పాత్ర అది.

సంక్రాంతికి సందడి



భాషతో సంబంధం లేకుండా కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవలే ‘సర్దార్ 2’ చిత్రంలో నటించారు. ప్రస్తుతం విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో కలిసి ‘పాకెట్ నోవెల్’తో తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు మాళవిక. ఇటీవలే ఈ సినిమాని డిసెంబరులో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే “పేజీలు తిరుగుతున్నాయి.. తేదీ ఖరారైంది. ‘పాకెట్ నోవెల్’ ఈ సంక్రాంతికి రాబోతోంది!’ అనే క్యాప్షన్‌తో ఒక కొత్త పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. ఈ పోస్టర్‌లో విజయ్ సేతుపతి, మాళవిక, రాజ్ బి.శెట్టి తదితరులు.. వాళ్ల మధ్యలో ఒక డబ్బుల బ్యాగ్ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాని టైలర్ డర్డెన్, కినో ఫిస్ట్ నిర్మాణ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇందులో రాజ్ బి.శెట్టి ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఐఓఏ అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా సింధు

దిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్ల కమిషన్ నూతన నాయకత్వం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్టార్ షట్లర్ పి.వి.సింధు ఐఓఏ అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా.. భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ వైస్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అగ్రశ్రేణి వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, స్విమ్మర్ సాజన్ ప్రకాశ్ ఐఓఏ సర్వసభ్య సమావేశానికి అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. ఈ నాలుగు పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ ప్రకటించారు. ఈ నలుగురు క్రీడాకారులు 2026-2030 కాలానికి గాను నాలుగేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. డిసెంబరు 5న ఐఓఏ ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సింధు, హర్మన్‌ప్రీత్ సభ్యులుగా చేరతారు. ఐఓఏ సర్వసభ్య సమావేశం ప్రతినిధులుగా ఎన్నికైన చాను, సాజన్.. డిసెంబరు 5న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే హక్కు కలిగి ఉంటారు. పది మంది సభ్యులతో కూడిన ఐఓఏ అథ్లెట్ల కమిషన్‌లో సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుసాలె (షూటింగ్), భవానీ దేవి (ఫెన్సింగ్), తజిందర్‌పాల్ సింగ్ తూర్ (షాట్‌పుట్), బొంబేలా దేవి (ఆర్చరీ), మంజీత్‌సింగ్ (కయాకింగ్- కనోయింగ్) సభ్యులుగా ఉన్నారు.



ధోనీని ‘మాహీ అంకుల్’ అని పిలుస్తా

‘కెప్టెన్’ కూల్ ఎంఎస్ ధోనీకిప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనుష్క సేన్ (తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా ‘మాహీ అంకుల్’ అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు. గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను పడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. ‘యహా మై ఘర్ ఘర్ ఖేలీ’ సీరియల్‌తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. ‘బాల్ వీర్’లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహాదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.



చెమటోడ్చినెగ్గిన భారత్

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోనూ భారత్‌కు అసలైన సవాల్ ఎదురైంది. ఈ పరీక్షలో టీమ్‌ఇండియా ఎట్టకేలకు పాసైపోయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కివీస్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా టాస్ ఆలస్యమైంది. దాదాపు గంట సమయం వృథా కావడంతో మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. లక్ష్యం చిన్నదేనా అయినా బౌలర్లకు పిచ్ అనుకూలించడంతో భారత్ ఆరంభంలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా 26 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 113 పరుగులు చేసింది. డీఎల్ఎస్ ప్రకారం అప్పటికే నాలుగు పరుగులు ఎక్కువ చేసిన టీమ్ ఇండియాను విజేతగా ప్రకటించారు. రోహిత్ శర్మ (23; 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు అలరించాడు. శ్రేయస్ అయ్యర్ (30; 46 బంతుల్లో), కేఎల్ రాహుల్ (26*) రన్స్ చేశారు. నమన్ ధిర్ (12), కోహ్లీ (7), అక్షర్ పటేల్ (7) తక్కువ స్కోరుకే పెవిలియన్ బాటపట్టారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు.

తొలుత న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. నాలుగో స్థానంలో వచ్చిన డారిల్ మిచెల్ (55; 104 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేశాడు. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31; 38 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. హెన్రీ నికోల్స్ (11) రన్స్ చేశాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో గుర్నూర్‌బ్రార్ (4/30) మరోసారి ఆకట్టుకున్నాడు. ఆకిబ్ నబీ, అన్ష్ ల్ కాంబోజ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. మూడో వన్డే మంగళవారం జరగనుంది.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945